ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు



బుధవారం 24 జనవరి 2024



1100 కేజీల అభిమానం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళగిరిలో 1100 కేజీల కేకును కట్ చేసి పంపిణీ చేశారు.



పొమ్మనకుండా.. పొగ

- రాజకీయ బలిపై లావు కినుక
- పార్టీకి, పదవికి శ్రీకృష్ణదేవరాయులు రాజీనామా
- సీటుపై అనిశ్చితి.. క్యాడర్‌లో గందరగోళంతోనే నిర్ణయం
- శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా పలువురు రాజీనామాలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 23: అవినీతి.. అరాచకాలు చేస్తోన్న వారిని వెనుకేసుకొస్తూ వారు కోరుకున్న సీట్లు ఇచ్చేందుకు భరోసా ఇస్తున్న వైసీపీ అధినేత సీఎం జగన్ వ్యూహాత్మకంగానే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులకు పొగ పెట్టారు. నియోజకవర్గం మారేందుకు ఇష్టపడని లావు నరసరావుపేట నుంచి అయితేనే పోటీ చేస్తానని లేకుంటే లేదని సీఎం జగన్‌కు చెప్పి వచ్చిన విషయం తెలిసిందే. 2019లో గుంటూరు అడిగితే నరసరావుపేట వెళ్లమన్నారు.. ఇప్పుడు నరసరావుపేట నుంచి గుంటూరుకు రమ్మంటున్నారు.. ఏం తప్పు చేశాను.. ఎందుకు సీటు మారాలి అని ప్రశ్నించి కొన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీకి, తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీకృష్ణదేవరాయులు ప్రకటించారు. గుంటూరులో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన రాజీనామా విషయాన్ని ప్రకటించారు. టికెట్ విషయంలో క్లారిటీ లేకపోవడం, క్యాడర్‌లో గందరగోళంతోనే తాను రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ గందరగోళం వల్ల అటు నాయకులకు, పార్టీకి, ఇటు తనకి ఉపయోగం లేదని, వీటన్నిటికీ తెరదించుతున్నట్లు స్పష్టం చేశారు. ఇన్నాళ్లు తన వెంట నడిచిన నాయకులకు, తన సీటు కోసం చొరవ చూపిన ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పల్నాడు అభివృద్ధి కోసం పరితపించాను : లావు

పల్నాడు ప్రజలు ఎంతో ఆదరాభిమానాలతో ఆశీర్వదించి ఎంపీ గా తనను లక్ష 55వేల ఓట్ల మెజారిటీతో అపూర్వ విజయాన్ని అందించారని కృష్ణదేవరాయులు విలేకర్ల సమావేశంలో తెలిపారు. అందరు ఎంపీల మాదిరిగా కాకుండా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేశానన్నారు. పల్నాడుని అబివృద్ధికి కేరాఫ్‌గా మార్చాలని పరితపించానని వివరించారు. ఏడు దశాబ్దాల కల వరికెపూడిసెల ప్రాజెక్టుకు అటవీ అనుమతులను సాధించి.. నిర్మాణంలో పురోగతిని సాధించామన్నారు. పల్నాడువాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు వైద్య విద్య అందేలా మెడికల్ కాలేజీని మంజూరు చేయించినట్లు తెలిపారు. మాచర్ల, రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయాలు మంజూరు చేయించినట్లు చెప్పారు. దాదాపు రూ.3000 కోట్లతో జాతీయ రహదారులు సాధించానని, 30 నిమిషాల్లో హైవే పైకి చేరుకునేలా పల్నాడులో రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని రహదారులు నిర్మాణం పూర్తవుతుండగా, మరికొన్నిటికి టెండర్లు పూర్తయ్యాయన్నారు. పల్నాడులో రైతులకు మేలు జరిగేలా.. ఇండో - ఇజ్రాయేల్ ప్రాజెక్టు సాధించానన్నారు. జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాలకు శాశ్వత భవంతిని నిర్మించినట్లు తెలిపారు. సొంత నిధులతో పొలాలకు, డొంకలకు వెళ్లే మార్గాలను బాగుచేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు నిర్మించినట్లు తెలిపారు.

లావు వెంట పలువురు..

దాచేపల్లి, కారంపూడి, గురజాలటౌన్, ప్రత్తిపాడు, సత్తెనపల్లి: శ్రీకృష్ణదేవరాయులు రాజీనామా పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. ఆయన ఏకకాలంలో పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన వెంటనే పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాము కూడా ఆయన వెంటే అంటూ రాజీనామాలు ప్రకటించారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు తీసుకొచ్చిన శ్రీకృష్ణదేవరాయులు సేవలు తమ ప్రాంతానికి అవసరమని, ఆయనతో కలిసి నడిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ఆయా నేతలు తెలిపారు. దాచేపల్లి మండల వైసీపీ సీనియర్ నాయకుడు కొణతం సూర్యనారాయణరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వైసీపీ జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ మాబూ తదితరులు రాజీనామా చేశారు. గురజాల నగర పంచాయతీ 12వ వార్డు కౌన్సిలర్ మహంకాళి అనిత, ఆమె భర్త నీలంరాజులు మంగళవారం వైసీపీకి రాజీనామా చేశారు. పెదనందిపాడు మండలానికి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు వెంట నడిచేందుకు ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు సిద్ధమయ్యారు. మంగళవారం పెదనందిపాడు మండలానికి చెందిన కొందరు నాయకులు ఎంపీని కలిశారు. పెదనందిపాడు మాజీ మండల కన్వీనర్ మదమంచి వాసు, రాజుపాలెం సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు, కాట్రపాడు సర్పంచ్ కొమ్మినేని దుర్గాప్రసాద్ ఎంపీని కలిసినవారిలో ఉన్నారు.




ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు నివాసం ఎదుట వైసీపీ ఫ్లెక్సీలు తొలగించిన ఆయన అభిమానులు

లావు ఇంటి ఎదుట ఫ్లెక్సీల తొలగింపు

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వైసీపీకి రాజీనామా చేసిన లావు శ్రీకృష్ణదేవరాయులుకు ఆయన అభిమానులు జేజేలు పలుకుతున్నారు. వైసీపీలో నిజాయితీపరులకు చోటు లేకుండా పోయిందని మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఎంపీ నివాసం ఉన్న రింగురోడ్డు వద్ద రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలను ఆయన అభిమానులు చించి పారేశారు. కొన్నింటిని తొలగించి అవతల పడేశారు. సామాజికవర్గం సాకుతో సిట్టింగ్ స్థానాన్ని కాదని వేరే చోటికి వెళ్లమనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ వెంటే మేము.. జై టీడీపీ... జై చంద్రబాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు.

తుదిలోనూ.. తప్పులే



అద్దంకి పట్టణంలోని 17 వ వార్డు ఓటర్ల జాబితాలో పాణెం ఇంటి పేరుతో కొత్తగా చేరిన ఓటర్లు

తుది ఓటర్ల జాబితాల్లో ఎలాంటి తప్పులు ఉండకూడదు.. గత ఫిర్యాదులు పునరావృతం కాకూడదు.. నూరు శాతం స్వచ్ఛీకరణ జాబితాలో ప్రచురించాలి.. అని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యక్షంగా జిల్లా ఎన్నికల అధికారులతో దీనిపై సమీక్షించింది. ఇక తప్పులు లేకుండా ఓటర్ల జాబితాలు ఉంటాయని అటు రాజకీయ పార్టీలు, ఇటు ఓటర్లు ఆశించారు. అయితే వారి ఆశలను వమ్ము చేస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏవైతే తప్పులు దొర్లాయో అవే పునరావృతమయ్యాయి. మొత్తంమీద ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఓటర్ల జాబితాలను రూపొందించినట్లు పలువురు విమర్శిస్తున్నారు. తుది ఓటర్ల జాబితాల ప్రచురణలో పాతకథే పునరావృతం అయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన ఒక్క రోజులోనే ఇన్ని తప్పులు బహిర్గతమవుగా.. రానున్న రోజుల్లో ఇంకెన్ని అక్రమాలు వెలుగుచూస్తాయో చూడాలి.

- ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు
- ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం
- తుది ఓటర్ల జాబితాల్లోనూ తప్పుల కొనసాగింపు

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో విడుదల ముసాయిదా ఓటర్ల జాబితాలో వెలుగు చూసిన లోపాలే తుది ఓటర్ల జాబితాల్లోనూ కనిపిస్తున్నాయి. మృతులు, వలస దారులు, డబుల్ ఎంట్రీలు, జీవో డోర్ నెంబరు ఇలా అనేక పొరపాట్లు బహిర్గతమయ్యాయి. ముసాయిదా జాబితాలోని తప్పులు, ఫిర్యాదులను సవరించి మార్పులు చేస్తామని చెప్పిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేసినట్లు కన్పించడం లేదు. తుది ఓటర్ల జాబితా విడుదలతో బీఎల్‌వోలు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోల నిర్లక్ష్యం బహిర్గతమైంది. ఎస్ఎస్ఆర్-2024 తుది ఓటర్ల జాబితా ప్రచురించేందుకు ఎన్నికల సంఘం అదనపు రోజులను కేటాయించినా బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు సరిగా దృష్టి పెట్టలేదని తేలింది. ఒకరికే రెండు ఓట్లు, నకిలీ ఫాం 7 దర ఖాస్తులు, మృతుల ఓట్లు తదితరాలపై పెద్దసంఖ్య లో గతంలో ఫిర్యాదులు అందజేశారు. వీటిపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఇంటింటి సర్వే కూడా చేపట్టారు. అయినా ఆ ఓట్లు అలాగే ఉన్నట్లు తుది ఓటర్ల జాబితాల్లో వెలుగుచూసింది. తుది ఓటరు జాబితాలు చూస్తే వారి నిర్లక్ష్యం అణువణువునా కనిపిస్తుంది. ఎస్ఎస్ఆర్- 2024కు సంబంధించి ఫైనల్ లిస్టులను ఇప్పటికే అధికారులు వివిధ రాజకీయ పార్టీలకు అందజేయగా వారు ఇంకా వాటిపై దృష్టి పెట్టలేదు. మరోవైపు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పీడీఎఫ్ జాబితాలు అందుబాటులోకి రావడంతో చాలా మంది ఓటర్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో చాలా తప్పులను సరిచేయకుండా పాత జాబితాలను అలానే ఉంచినట్లు తేలింది. అధికారులు సోమవారం విడుదల చేసిన జాబితాలను అంతంత మాత్రంగా పరిశీలిస్తేనే ఇన్ని తప్పులు బహిర్గతమయ్యాయంటే క్షుణ్ణంగా శోధిస్తే భారీ సంఖ్యలోనే వెలుగులోకి రాక తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓటర్ల జాబితాలన్నింటిని తనిఖీ చేస్తే తప్పులు వేల సంఖ్యలోనే బయటపడే అవకాశం ఉన్నది. వీటికి బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు ఏమి సమాధానం చెబుతారో చూడాలి. ఎన్నికల సంఘం కూడా వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.

- ఇల్లు లేని వారికి మాచవరం గ్రామంలో ఓట్లు ఉన్నాయి. వీరికి వేర్వేరు గ్రామాల్లో కూడా ఓట్లు ఉన్నాయి. అయినప్పటికీ కావాలనే అధికారులు తొలగించలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 923 ఓట్లు ఉండగా వారిలో ఇతర గ్రామాలకు చెందిన వారికి సుమారు 170 మంది ఉన్నారు. వారికి ఇంటి స్థలం, ఇల్లు లేకపోయినా జాబితాలో ఓట్లు ఉన్నాయి. గొట్టిముక్కలలో ఉండే పాలగుండ్ల కనకమ్మ, మున్నా రమణ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. చిన్న గ్రామమైన రేగుల గడ్డలోనే ఇన్ని ఓట్లు అక్రమంగా ఉన్నాయంటే మిగిలిన గ్రామాల్లో అక్రమ ఓట్లు ఎందుకు ఉండవనే అనుమానాలు ప్రజల్లో వస్తున్నాయి.
- నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం బూత్ నెంబరు 276లో గతంలో 253 ఓట్లు ఉండగా తుది జాబితాలో 213 ఓట్లు మాత్రమే ఉన్నాయి. జాబితాలో 25 మంది చనిపోయిన వారు ఉండగా 40 ఓట్లు ఉద్దేశ పూర్వకంగా తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. అల్లిబాయిపాలెంలోని 224 పోలింగ్ బూత్ లో 30 ఓట్లను తొలగింపుల జాబితాలో చేర్చారు. కొండలరాయునిపాలెం, ప్రకాశం జిల్లా కుంట, వినుకొండలోని మసీదు మాన్యాల్లో తొలగించిన వారి పేర్లను అల్లిబాయిపాలెంలోని ఓటర్ల జాబితాలో చేర్చారు.
- బల్లికురవ మండలం కొప్పెరపాలెం గ్రామానికి చెందిన 28 మందికి కొప్పెరపాలెంతో పాటు పల్నాడు జిల్లా నరసరావుపేట, చిలకలూరిపేట, తుబాడు, బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, బల్లికురవ గ్రామాలలో రెండో ఓటు ఉన్నట్లు వెలుగు చూసింది. 53 మందికి రెండేసి ఓట్లపై గత నెలలో టీడీపీ నేతలు ఆధారాలతో ఫిర్యాదులు చేశారు. అధికారులు విచారణ చేపట్టినా ఇంకా 28 మంది ఓట్లు రెండుచోట్ల అలానే ఉన్నాయి. ఒకే వ్యక్తికి కొప్పెరపాలెంతో పాటు బల్లికురవ, కొమ్మినేనివారి పాలెం, పొరుగు జిల్లాలో కూడా ఓట్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది.

పెదకూరపాడు ఓట్లు అద్దంకికి..

అద్దంకి: ఓటర్ల మార్పులు, చేర్పుల్లో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని, వారికి ఎన్నికల అధికారులు సహకరించారని తుది ఓటర్ల జాబితాల్లో దొర్లిన తప్పులు చూస్తే అర్థమవుందని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి బంధువుల ఓట్లను అద్దంకి నియోజకవర్గంలో చేర్చే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు విమర్శలు వస్తున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామం నుంచి అద్దంకి నియోజకవర్గానికి ఓట్లు బదిలీ అయినట్లు తెలిసింది. సుమారు 82 మందికి సంబంధించి ఆధార్ కార్డుల అడ్రస్‌లను కొద్దిరోజుల క్రితమే అద్దంకికి మార్చారు. వాటి ఆధారంగా ఓట్లు చేర్పులు చేసినట్లు తెలుస్తోంది. సోమవారం ప్రకటించిన ఓటర్ల జాబితాలో అద్దంకి 155, 156 బూత్‌లలో హనిమిరెడ్డి బంధువులకు సంబంధించిన 25 ఓట్లను టీడీపీ నేతలు గుర్తించారు. వేరే నియోజక వర్గం ఓట్లు గుంపగుత్తగా చేర్చడంపై తహసీల్దార్, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఉమాదేవిని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఓట్లు చేర్పులకు 9వ తేది చివరి రోజుగా ప్రకటించి అనంతరం ఎలా దరఖాస్తులు తీసుకున్నారన్నారు. దీనిపై ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా ఫాం7 ఇస్తే విచారణ చేసి తొలగిస్తామని చెప్పడంపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు.



అగ్గిరాజుకుంటే.. బూడిదే

కోల్డ్‌స్టోరేజీల్లో రైతుల కష్టం దైవాదీనం

- నిల్వ వసూళ్లు అధికం.. వసతులు మృగ్యం
- శీతల గిడ్డంగుల్లో నిబంధనలకు తిలోదకాలు
- అగ్నిమాపకశాఖ అనుమతులు లేకుండానే నిర్మాణం
- ప్రమాదాల సమయంలో హడావుడి ఆ తర్వాత నిర్లక్ష్యం
- భద్రతా ప్రమాణాలపై చేష్టలుడిగి చూస్తోన్న అధికారులు

గుంటూరు సిటీ, జనవరి 23: దుగ్గిరాల శీతల గిడ్డంగిలో అగ్గిరాజుకుంది. రైతుల కష్టమైన లక్షా 20 వేల పసుపు బస్తాలు బూడిదయ్యాయి. మంచి ధర వస్తే అమ్ముకుందామని ఎదురు చూస్తుండగానే ఘోరం జరిగిపోయింది. గతంలో గుంటూరులో కూడా ఇలానే పలు శీతల గిడ్డంగుల్లో రూ.కోట్ల పంట మాడిమసయ్యింది. శీతల గిడ్డంగుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు వాటి యజమానులు, ఇటు అధికారుల్లో చలనం ఉండటంలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు తాత్కాలికంగా హడావుడి చేస్తున్నారే కాని రైతుల రెక్కల కష్టానికి సరైన భద్రత కల్పించాలన్న ఆలోచన చేయడంలేదు. దుగ్గిరాల ప్రమాదం తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శీతల గిడ్డంగుల భద్రతపై చర్చ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 128 శీతల గిడ్డంగుల్లో ఏ ఒక్క దానికి కూడా అగ్నిమాపక శాఖ అనుమతి లేదని సమాచారం. గుంటూరు నగర పరిధిలోని 80 శీతల గిడ్డంగుల్లో ప్రమాదం జరిగితే చాలావాటిల్లో అగ్నిమాపక శకటం లోపలికి వెళ్లే అవకాశం కూడా తక్కువే. గతంలో జరిగిన అగ్ని ప్రమాదాల్లో కోట్ల విలువ చేసే మిర్చి బూడిదైంది. అయినా మిగిలిన స్టోరేజ్‌ల యజమానులు గుణపాఠం నేర్వలేదు. ఏమీ కాదులే అన్న నిర్లక్ష్యంతో ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీజన్‌కు టిక్కీకి రూ.100 మాత్రమే వసూలు చేయాలి. అయితే కొందరు టిక్కీకి రూ.200 లకు తగ్గకుండా వసూలు చేసున్నారు. అయినా రైతుల రెక్కల కష్టానికి మాత్రం సరైన భద్రత కల్పించలేకపోతున్నారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో కోట్ల విలువ చేసే మిర్చిని నిల్వ చేస్తున్నారు. ఒక్కో స్టోరేజ్ సామర్థ్యం 50 వేల టిక్కీల నుంచి లక్షా 50 వేల టిక్కీల వరకు ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో మిర్చి టిక్కీ రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన కోల్డ్ స్టోరేజ్‌ల్లో రూ.20 కోట్ల నుంచి రూ. 30 కోట్ల విలువైన మిర్చి ఉంటుంది. ఈ పంటకు ముందే ఇన్సూరెన్స్ చేయిస్తున్నామని యజమానులు చెబుతున్నా అది ఎంత వరకు నిజమో తెలియదు. సాధారణంగా కోల్డ్ స్టోరేజ్‌లో అగ్గి రాజుకోవడం అసాధ్యం. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరుగుతుంది. నిరంతరం ఏసీలు రన్నింగ్‌లో ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. వేసవిలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవిస్తే దానిని గుర్తించే లోపే చెప్పలేనంత నష్టం జరుగుతుంది.

జీవో 119కి వక్ర భాష్యం

ఒక పక్క ప్రమాదం పొంచి ఉన్నా కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు మాత్రం జీవో 119కి వక్రభాష్యం చెబుతున్నారు. ఈ జీవో మేరకు 18 మీటర్లు దాటిన కట్టడానికి కచ్చితంగా అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండాలి. ఆయా కట్టడాల్లో అగ్ని ప్రమాదాలు నివారించే తాత్కాలిక ఏర్పాట్లు ఉండాలి. అయితే కోల్డ్ స్టోరేజ్‌ల యజమానులు తమ బిల్డింగ్‌లు 18 మీటర్ల కంటే తక్కువ ఎత్తు అని జీవోలోని నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. బిల్డింగ్‌లోని సెల్లార్‌లను వదిలిపెట్టి మిగిలిన కట్టడానికి కొలత చూపిస్తున్నారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అనుమతి తప్పించుకునేందుకు ఇలా చేస్తున్నారని అధికారులు చెబుతున్నారే కాని వారిపై చర్యలు తీసుకోవడంలేదు. ఇదే అవకాశంగా మిగిలిన గిడ్డంగుల యజమానులు కూడా నిబంధనలు పాటించడంలేదు.

చేష్టలుడిగిన యంత్రాంగం

కోల్డ్ స్టోరేజ్‌ల్లోని భద్రతా ప్రమాణాల విషయంలో అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. ఏ ఒక్క స్టోరేజ్‌కి అగ్నిమాపక శాఖ అనుమతి లేదని తెలిసినా ఏమి తెలియనట్లుగా ఉంది. ఒక వేళ ఏదైనా ప్రమాదం సంభవించి అగ్నిమాపక వాహనం లోపలకు వెళ్లాలన్నా అవకాశం లేదు. అయినా అధికారులు కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో కోల్డ్ స్టోరేజ్‌ల వివరాలు కూడా లేవంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు.



● గుంటూరు బైపాస్ పక్కన ఉన్న కోల్డ్ స్టోరేజీలు

ఫ్యాను.. కకావికలం

వైసీపీలో అంతా గందరగోళం

- రేపల్లె ఇన్‌చార్జి గణేశ్‌పై పునరాలోచన
- సీఎంవో బాట పట్టిన ఎంపీ మోపిదేవి
- అద్దంకిలో అధికార పార్టీని వీడుతున్న నేతలు
- రెండు రోజుల్లో కీలక నిర్ణయం దిశగా ముఖ్య నేత అడుగులు
- ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ మంత్రి ద్వారా రాయబారాలు

బాపట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పు.. పార్టీని వీడుతున్న, వీడనున్న నాయకులతో ఫ్యాను పార్టీలో పరిస్థితి కకావికలంగా మారుతోంది. జిల్లాలో నెలకొంటున్న పరిస్థితులతో వైసీపీ పెద్దలకు తలబొప్పి కడుతోంది. ఇన్‌చార్జిల మార్పు వ్యవహారం ఇంకా గందరగోళం సృష్టిస్తూనే ఉంది. రేపల్లె ఇన్‌చార్జిగా ఈవూరి గణేశ్‌ను నియమించినప్పటి నుంచి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఏదో ఒక రూపంలో పరోక్షంగా అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. సంతమాగులూరు మండల వైసీపీ నేతలు టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అద్దంకి నియోజకవర్గ వైసీపీలోని ఓ నేత రెండుమూడు రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబును కలవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

తననే కొనసాగించాలి..

మంగళవారం సీఎంవో బాట పట్టిన ఎంపీ మోపిదేవి రేపల్లెలో తననే ఇన్‌చార్జిగా నియమించాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై పార్టీ పెద్దలకు వివరించినట్లు సమాచారం. కానీ అధిష్ఠానం నుంచి సీటు విషయంలో నిర్దిష్టమైన హామీ దక్కలేదని తెలుస్తోంది.



మరో వైపు ఆయన అనుచరులు మాత్రం సీటు తమ నేత మోపిదేవికేనని, మార్పు చేయడానికే ఆయనను సీఎంవోకు పిలిపించారని ప్రచారం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈవూరు గణేశ్‌ను కూడా తాడేపల్లికి పిలిపించుకుని మరోసారి చర్చించిన తర్వాత తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి మాజీ మంత్రి...

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సంతమాగులూరు నేత అట్లా చినవెంకటరెడ్డి తనతో పాటు తొమ్మిది మంది ఎంపీటీసీలు, 12 మంది సర్పంచ్‌లతో టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం అద్దంకి ఎమ్మెల్యే రవిను జొన్నతాళిలోని క్యాంపు కార్యాలయంలో భేటీ అయిన సంగతి తెలిసిందే. దీంతో ఉలిక్కిపడ్డ వైసీపీ తొలుత సీఎంవోలోని కీలక వ్యక్తుల చేత బుజ్జగింపుల పర్వానికి తెరలేపింది. ఓదశలో చినవెంకట రెడ్డిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. తొలినుంచి ఈయన ఉమ్మడి ప్రకాశం పరిధి లోని మాజీ మంత్రి అనుచరుడుగా కొనసాగుతూ వస్తున్నారు. పార్టీని వీడొద్దంటూ సీఎం బంధువు సూచన మేరకు సదరు మాజీ మంత్రి ద్వారా రాయబారం నడిపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆయన మొత్తబడలేదని, రెండు మూడురోజుల్లో తన వర్గంతో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరడం ఖాయమని తెలుస్తోంది.

ఓ కీలక నేత సైతం..

మొన్నటి వరకు అద్దంకి వైసీపీకి పెద్దదిక్కుగా వ్యవహరించిన ఓ కీలక నేత ఆయన తండ్రితో కలిసి త్వరలో టీడీపీ అధినేత చంద్రబాబును కలవడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే తెరవెనక ఏర్పాట్లు జరిగిపోయాయయని సమాచారం. కాకపోతే ఉమ్మడి ప్రకాశం పరిధిలో తనకు సీటు ఇచ్చే విషయంలో హామీ ఇవ్వాలని ఆ నేతలు పట్టుబడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని సదరు నేత కూడా ఖండించకపోవడం గమనార్హం. ఆ తండ్రీ కొడుకులు కూడా వైసీపీని వీడితే అద్దంకిలో పాలకపార్టీ పరిస్థితి మరింత దిగజారడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

అంతా అనిశ్చితే...

ఏ సీటులో ఏ రోజు ఎవరుంటారో తెలియని అనిశ్చితి ఒకవైపు పాలకపార్టీలో ఉంటే మరో వైపు టీడీపీలోకి క్యూ కట్టే నేతలు రోజురోజుకు పెరుగుతుండడంతో పార్టీ పెద్దలకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దీనిలో భాగంగా పార్టీ మారే నేతలకు అవసరమైతే పెద్దమొత్తంలో తాయిలాల ఎర వేయడానికి కూడా వెనకాడొద్దని స్థానిక నేతలకు ఆదేశాలు ఇస్తున్నారనేది సమాచారం. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న నేత పార్టీ మారాలనుకున్న నేతలకు పెద్దమొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

అమరావతి రైతులది ధర్మపోరాటం

● 1498వ రోజుకు చేరిన ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 23: మాది ధర్మ పోరాటం.. వైసీపీ పాలకులరా.. మీది అధర్మ, అన్యాయమైన పాలన అని రాజధానికి అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1498వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అమరావతిని కాదని మూడు రాజధానులనటం తెలుగు జాతికే కళంకం అని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి అయినా మూడు రాజధానులున్నాయా.. అని ప్రశ్నించారు. మూడు రాజధానులకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా అంగీకరించలేదన్నారు. అయినా సీఎం జగన్‌రెడ్డి పట్టించుకోకపోవటం నియంత పాలనకు అద్దం పడుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

నైతిక విలువలు గల నేత కూనంనేని

● రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ

పిట్టలవానిపాలెం, జనవరి 23: నైతిక విలువలు లేని, ప్రజలకు ఉపయోగపడని రాజకీయాలు చేయకూడదనేది సీపీఐ పార్టీ లక్ష్యమని రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామపంచాయతీలలో మంగళవారం గ్రామ నివాసి, తెలంగాణ రాష్ట్ర కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. సభలో సంగుపాలెం, కోడూరు గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు రాష్ట్రంలో భ్రష్టు పట్టిపోయాయని విమర్శించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేసేవారిలో సాంబశివరావు ఒకరని ఆయన కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కుగ్రామమైన సంగుపాలెం కోడూరు నుంచి 40ఏళ్ళ క్రితం తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం వాసిగా స్థిరపడి సీపీఐ పార్టీలో కీలక పదవులు అలంకరించి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవటం నిబద్ధతతో కూడిన విజయమని అన్నారు. బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు ప్రలోభాలకు ఆకర్షితులై నీతినిజాయితీ కలిగిన నాయకులను ప్రజలు దూరం చేసుకుంటున్నారని అలాంటి సంస్కృతి మారాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, సీపీఐ నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా సినీగాయకులు వందేమాతరం శ్రీనివాసరావు పలు గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో మువ్వా రమేష్, సర్పంచ్‌లు ఎనికేపల్లి శివకుమారి, ఐనంపూడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయన గంగయ్య, స్థానిక టీడీపీనాయకులు జాలాది లోకరాజ్యుడు, ఉయ్యూరి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్‌బాబు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎండడీ అఫ్జల్, బండారి శ్రీనివాసరావు, తెలంగాణ సీపీఐ కార్యదర్శి సాబీర్ బాషా, సీపీఐ నాయకులు సింగరకొండ, భాగ్యశ్రీధర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ తదితరులు

ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని లూటీ చేసిన జగన్

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ, డాక్టర్ కడియాల తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 23: ఒక అవకాశం ఇచ్చి ప్రజలు భారీ మెజారిటీతో గెలిపిస్తే జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని లూటీ చేశారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం నరసరావు పేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జీవీ మాట్లాడుతూ మద్యం నిషేధిస్తానని చెప్పి ఏటా వేల కోట్లు దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు, మైనారిటీలకు చంద్రబాబునాయుడు సబ్‌ప్లాన్ నిధులు ఇచ్చి వారి సంక్షేమానికి కృషిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పేరుకు కార్పొరేషన్‌లు పెట్టి ఒక్క కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వలేదన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో రూ.64 వేలకోట్లు నిధులు ఇచ్చి 24 ప్రాజెక్టులు పూర్తిచేసి, లక్షలాది ఎకరాలకు నీరు ఇచ్చారని అన్నారు. వాటర్‌గ్రిడ్‌కు రూ.640 కోట్లు ఇచ్చారని, 611 గ్రామాలకు ప్రతిఇంటికి మంచినీళ్ళు ఇవ్వాలని, గురజాల, మాచర్ల, వినుకొండ ఇక్కడి వాటర్ గ్రిడ్‌కు టెండర్లు పిలిచారని, వైసీపీ ప్రభుత్వం రాగానే పనులు ఆపేశారన్నారు. రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్యపానం రద్దు చేస్తామని, సీపీఎస్ విషయంలో వైసీపీ ప్రభుత్వం మాటతప్పిందన్నారు. 34వేల ఎకరాలు ఇచ్చిన రైతులను మోసం చేశాడని, ప్రజావేదిక కూల్చారని, అంగన్‌వాడీ మహిళలు 42 రోజులుగా ఆందోళన చేస్తుంటే పోరాటాన్ని క్రూరంగా అణచివేశారని అన్నారు. టీడీపీ నరసరావుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రా.. కదలిరా బహిరంగ సభలకు ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేస్తున్నారని అన్నారు. ఈ రాష్ట్రానికి పట్టిన శని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదన్నారు. అహంభావంతో ఉన్న కేసీఆర్‌ను తెలంగాణలో ప్రజలు గద్దె దించారని, జగన్‌మోహన్‌రెడ్డిని ఆంధ్రలో గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రతో యువతను మేల్కొల్పిన నేత లోకేశ్

● మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, జనవరి 23: నిద్రాణంలో ఉన్న యువతను మేల్కొల్పిన నేత నారా లోకేశ్ అని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నియోజకవర్గం కేంద్రమైన వేమూరులోని టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌బాబు, లోకేశ్ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి ప్రజలకు చేరువ అవడంతో పాటు అన్ని వర్గాల సమస్యలను లోకేశ్ మనసులో నిక్షిప్తం చేసుకున్నారన్నారు. అదే సందర్భంలో చంద్రబాబునాయుడుని కూడా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని తీవ్రంగా విమర్శించారు. మొక్కవోని పట్టుదలతో లోకేశ్ ఎంతో ఉత్సాహంగా పాదయాత్రను చేయడం ద్వారా కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. మరో 78 రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయని, అందుకు ప్రతి ఒక్కరూ కూడా సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తెలుగుదేశం పార్టీతో కలసి అడుగులు వేస్తున్నారని ఇందుకు టీడీపీ శ్రేణులు, జనసేన శ్రేణులతో చేయి కలిపి ముందుకు నడవాలి అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నవ సుబ్బారావు, డాక్టర్ చందోలు పృథ్వీలత, డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబు, దొప్పలపూడి సుధాకర్, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, శరత్‌చంద్ర, చావా రాఘవరావు, కృష్ణ భగవాన్, గంటా స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

పేదలను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



కొల్లిపర మండలం అన్నవరంలో పాదయాత్ర చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

కొల్లిపర, జనవరి 23: వైసీపీ ప్రభుత్వం పేదప్రజలను అనేక రకాలుగా మోసం చేస్తున్నట్లు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రజాయాత్రలో భాగంగా మండలంలోని కొత్తూరులంక, అన్నవరంలంక, అన్నరం, అన్నవరంగౌడ గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అవినీతి, అబద్ధపు మాటలతో, మోసపూరిత వాగ్దానాలతో అలవికాని హామీలతో రాష్ట్ర ప్రజలను వంచన చేసి అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలకు, దోపిడీలకు ప్రజలు విసిగి పోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆలపాటి వెంకటేశ్వరరావు, పాలడుగు జోగేంద్ర, అరవపల్లి అప్పయ్య, తాతా అంజనేయులు, అద్దెపల్లి రమేష్, తాతా శివయ్య, మిరకన పల్లి రవి, నక్కా అనిల్, కారుమంచి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌దే

● పాదయాత్రలో చింతల అశోక్ కుమార్

గుంటూరు, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రం గా మార్చిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీడీపీ యువనేత చింతల అశోక్‌కుమార్ అన్నారు. 'అంబేడ్కర్ ఆశయం- చంద్రన్న ఆచరణ' కావాలంటూ ఇచ్ఛాపురం నుంచి తిరుమల వరకూ ఆయన చేపట్టిన పాదయాత్ర మంగళవారం గుంటూరు నగరా నికి చేరుకుంది. ఈ సందర్భంగా అశోక్ మాట్లా డుతూ అంబేడ్కర్ ఆశయాన్ని అమలుచేసే చంద్రన్న పాలన రాష్ట్రానికి కావాలని అన్నా రు. జగన్ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలు అని చెబుతూనే ఆయా వర్గాలకు తీరని అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ లకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసిన జగన్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధు లను 28వేల కోట్లను దారిమళ్లించి ఎస్సీల అభివృద్ధి, సంక్షేమాలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే స్వయం ఉపాధి బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాలు, ఇన్నోవా కార్లు ఇవ్వకుండా ఎస్సీ యువతరాన్ని నిరుద్యోగంలోకి నెట్టా రన్నారు. మళ్లీ రాష్ట్రం గాడిన పడాలంటే చంద్రబాబు పాలన రావాలన్నారు. చంద్ర బాబు తిరిగి అధికారంలోకి రావడం కోస మే పాదయాత్ర నిర్వహిస్తున్నానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.



పాదయాత్రగా గుంటూరు చేరుకున్న అశోక్, అనుచరులు

విధుల్లో చేరినా కక్షసాధింపు చర్యలే

బాపట్ల, జనవరి 23: న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేసి ప్రభుత్వ హామీతో విరమించి విధుల్లో చేరిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌పై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారు. సూపర్‌వైజర్ దగ్గర నుంచి పీడీ వరకు వీరిపట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మంగళవారం కేంద్రాలు తీసేందుకు వెళ్ళిన కార్యకర్తలకు తాళాలు ఇవ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టించుకోలేదు. సమ్మె చేస్తున్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి సచివాలయ సిబ్బందికి అప్పగించిన అధికారులు ఇప్పుడు కార్యకర్తలకు తిరిగి తాళాలు ఇప్పించలేకపోయారు. కేంద్రంలో ఉన్న స్టాక్‌ను అప్పజెప్పి తాళాలు ఇవ్వాల్సిన ఐసీడీఎస్ అధికారులు తమకేమి పట్టదన్నట్లు కార్యాలయంలోనే ఉండిపోయారు. తమకు ఇష్టమైన కార్యకర్తలకు మాత్రం తాళాలిచ్చారని ఎక్కువమందికి అంగన్‌వాడీకేంద్రం తాళాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కొంతమంది కార్యకర్తలు సచివాలయాల వద్దకెళ్ళి తాళాలు కోసం గంటల కొద్ది వేచి ఉండి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమ్మె చేశారన్న కారణంగానే తమపై ఆగ్రహంతో కక్షసాధింపు చేస్తున్నారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. కాగా ఈవిషయమై ఐసీడీఎస్ అధికారులను వివరణ కోరగా డ్యూటీలో చేరేవారు తమను సంప్రదించి కొన్ని పత్రాల మీద సంతకాలు పెట్టిన తర్వాత జాయినింగ్ లెటర్ ఇస్తామని చెప్పారు. అప్పుడు విధులలో చేరవచ్చు అని వారికి తాళాలు ఇస్తారని చెప్పారు. ఐసీడీఎస్ అధికారులే తాళాలు ఇవ్వద్దు అని చెప్పినట్లు సచివాలయ సిబ్బంది పేర్కొంటున్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇవ్వకపోవటంతో కేంద్రాల వద్ద వేచిచూస్తున్న కార్యకర్తలు

35 మంది ఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి

గుంటూరు, జనవరి 23: రేంజి పరిధిలో 35మంది ఎస్‌ఐలకు సీఐగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ పాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు ఈ మేరకు ఈ నెల 19న ఉద్యోగోన్నతుల ప్యానెల్ కమిటీ సమావేశమై ఎస్‌ఐల సీనియారిటీ, రిజర్వేషన్, రోస్టర్ ప్రాతిపదికన పరిశీలించి జాబితాను ఎంపిక చేసింది. ఉద్యోగోన్నతి పొందిన వారి వివరాలిలా ఉన్నాయి. సీహెచ్ కృష్ణానందం, సీహెచ్ ఎల్ఎన్ శ్రీనివాసరావు, బీ సుబ్బనాయుడు, ఏ సుబ్బరాజు, పీ ఉదయబాబు, షేక్ మౌలాషరీఫ్, కే మహాలక్ష్మి, కామరాజుగడ్డ సాంబశివరావు, డీ వినోద్‌కుమార్, ఆర్ అహ్మద్‌జానీ, వై కోటేశ్వరరావు, వై శ్రీహరి, సోడిశెట్టి శ్రీనివాసరావు, సీహెచ్ సింగయ్య, జే శ్రీనివాస్, దాసరి ప్రసాద్, సీహెచ్ హజరతయ్య, షేక్ అలీసాహెబ్, ఈ బాలనాగిరెడ్డి, కే వెంకటప్రసాద్, కే సురేష్, ఎస్ సుబ్బారావు, షేక్ సుభాని, కే ఆరోగ్యరాజు, ఎం విజయ్‌చరణ్, పీ రమేష్, పీ భాస్కర్, పీ సురేష్, కే శేఖర్‌బాబు, సీహెచ్ లోకనాథం, యేమినేని నాగరాజు, కేవీ కోటేశ్వరరావు, జీ శివన్నారాయణ, నాగకుమారి.

వీఆర్‌కు నలుగురు సీఐలు

గుంటూరు, జనవరి 23: రేంజ్ పరిధిలో మరికొంత సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం ఐజీ పాలరాజు ఉత్త ర్వులు జారీచేశారు. రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐలుగా పనిచేస్తున్న ఎం.ఆనందరావు, ఎం.శేషగిరిరావు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ ఆర్.సురేష్, గుంటూ రు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాజశేఖర్ రెడ్డిలను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

నేడు ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వర్ధంతి

పొన్నూరుటౌన్, జనవరి23: క్షీర విప్లవ సారధి, మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 30వ వర్ధంతి కార్యక్రమాలను బుధవారం నిర్వహించటానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకు చింతలపూడిలోని వీరయ్య చౌదరి స్మృతివనం వద్ద ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, కుటుంబసభ్యులు నివాళులు అర్పించనున్నారు. అనంతరం నిడుబ్రోలు పీబీఎన్ కళాశాలలో మాజీ మంత్రులు వీరయ్యచౌదరి, పరిటాల రవి వర్ధంతి వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. సాయంత్రం 4 గంటలకు పొన్నూరు టీడీపీ కార్యాలయంలో సభ నిర్వహించనున్నట్లు టీడీపీ కార్యాలయం తెలిపింది.

ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు



మొదటిస్థానంలో నిలిచిన ఎడ్లజత

దుర్గి, జనవరి 23: మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వార్షికోత్సవం పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం న్యూకేటగిరి విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మునగాకుల వెంకటేశ్వర్లు, వెలిదండి గోపాలు ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన మేకల ప్రతాప్ ఎడ్లజత 4,800 అడుగుల దూరంతో మొదటి స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా కంభం మండలం దర్గాకు చెందిన లాయర్ కృష్ణ ఎడ్లజత 4,503 అడుగుల దూరంతో రెండోస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యళ్ల సాంబశివరావు ఎడ్లజత 4,400 అడుగుల దూరంతో మూడోస్థానం, కృష్ణా జిల్లా ఘంటశాల మండలం చినకల్లెపల్లికు చెందిన యళ్లవల్లి వెంకటేశ్వరరావు ఎడ్లజత నాలుగోస్థానం, కృష్ణా జిల్లా మల్లవల్లికి చెందిన అక్కినేని నకుల్ సత్యచౌదరి ఎడ్లజత ఐదోస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన తాండవ వెంకటేశ్వర్లు ఎడ్లజత ఆరోస్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. కటకం రామారావు, గంది గోపాలరావు పర్యవేక్షించారు.

ఎస్‌ఈబీలో భారీగా బదిలీలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి23: ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ)లో ముగ్గురు ఏఈఎస్‌లను, పదిమంది సీఐలను, 29మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.నరసింహారావు బాపట్ల నుంచి మంగళగిరి హెడ్‌క్వార్టర్‌కు, టీఎస్ దుర్గాప్రసాద్‌ను నరసరావుపేట నుంచి మార్కాపురానికి, ఎస్.కృష్ణకిషోర్‌ను నెల్లూరు నుంచి గుంటూరు ఏఈఎస్‌గా నియమించారు. బదిలీ అయిన సీఐల వివరాలు.. పి.విజయ్ కుమార్‌ను గూడూరు నుంచి. గుంటూరు-1కు, బి.లతను ఒంగోలు నుంచి గుంటూరు-2కు, పి.ప్రసన్నలక్ష్మిని వాకాడు నుంచి. మంగళగిరికి, ఎస్.కె అబ్దుల్ జలీల్‌ను కనిగిరి నుంచి వినుకొండకు, ఎన్.వెంకటరమణను యర్రగొండపాలెం నుంచి గురజాలకు, కేపీ కిషోర్‌ను నెల్లూరు -1 నుంచి మాచర్లకు,వి.వెంకటేశ్వరరావును నెల్లూరు-2 నుంచి. బాపట్లకు, బి.నయనతారను ఆత్మకూరు నుంచి నరసరావుపేటకు, డి.సూర్యనారాయణను సూళ్లూరుపేట నుంచి పిడుగురాళ్లకు, ఆర్.ప్రసాద్‌ను. బీవీ పాలెం చెక్‌పోస్ట్ నుంచి నగరానికి బదిలీ చేశారు.

రేపు టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సమావేశం

గుంటూరు, జనవరి 23 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 25న మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతుందని ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కేంద్ర, రాష్ట్రస్థాయి ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరవుతా రని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనాయకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ ప్రభుత్వంలో రద్దు చేసిన 16 సంక్షేమ పథకాల పునరుద్ధరణ, గిరిజనులపై దాడులు, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మాత్రమే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ టీడీపీ ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో నెంబర్ 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే ఈ ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లకపోవడం, రాష్ట్రంలో ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, గిరిజనుల నిధులు గిరిజనులకే కేటాయించాలి అనే ప్రధాన డిమాండ్లపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు ధారూనాయక్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.58 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,24,670 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,15,444 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డు ఆవరణలో 62,019 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	9000	18000
273	11500	18000
341	9000	19800
4884	9000	17000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
సూపర్ 10	9000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9800	20000
దేవనూరుడీలక్స్	9000	19000
తెల్లకాయలు	5000	13000

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➾ గుంటూరు సిటీలోని ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు లేడి అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్ర॥ 9553715528, 81423 11488
AJG-184045

➾ Wanted Sales Executives for NEXA Car Showroom in Guntur. Experience / Fresher in Sales can apply. Con:80965 77891.
AAA-8644

అమ్మకం

➾ గుంటూరుకు అత్యంత సమీపంలో అంకిరెడ్డిపాలెం రోడ్డు (ఇన్నర్ రింగ్‌రోడ్డు - నల్లపాడు) లో కన్నా టవర్స్ అపార్ట్‌మెంట్ నందు 204 నంబర్ ఫ్లాట్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8790907243, 9440613331
AJG-151745

PLOT FOR SALE

➾ 300 చ॥గుల ఖాళీ స్థలము (దక్షిణ ఫేసింగ్) చిలకలూరిపేట - చీరాల రోడ్డు నందు గల నరసింహస్వామి దేవాలయం దగ్గరలో అమ్మకమునకు కలదు. గృహములకు గోడౌన్లకు అనుకూలమైనది. సంప్ర॥ 94903 19847, 83098 89615.
RK-1305

➾ వేగంగా అభివృద్ధి చెందుతున్న గుంటూరు మున్సిపాలిటీ పరిధి ఇన్నర్ రింగ్ రోడ్డు (గోర్లవారిపాలెం)లో తక్షణమే గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్స్. రాజధాని నుండి 200 అడుగుల రోడ్డును ఆనుకొని నూతన వెంచర్ CRDA ప్లాట్లు కలవు. 75% బ్యాంకు లోన్ సదుపాయం కలదు. సంప్ర॥ 99123 42199, 7661014341.
AAA-8653

స్థలం అమ్మకము

➾ గుంటూరు సిటీ పాత గుంటూరులో మానూరివారి వీధిలో 67 గజముల స్థలం అమ్మబడును. వివరాలకు : B S Rao, Phone No: 9490020123
AJG-184456

లీకేజీ సమస్యలా?

➾ బాత్‌రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజిపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892
AJG-166894

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➾ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-181867

పోయినవి

➾ మాచర్ల అదిలక్ష్మి W/o. వెంకట సర్వు D.No: 7-2-5, పేరాల, చీరాల, బాపట్ల జిల్లా. A.P. నాకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 1833/1978 (SRO-చీరాల) తెనాలి ఆర్టీసీబస్టాండ్ దగ్గరకు వెళుతుండగా నాకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్ 9573761786కు తెలుపగలరు.
AJG-184085

➾ Andra Vasavi D/o. Andra Subbarao, D.No: 10-95-1/4, అమరావతి ఫ్లాట్స్, చెంచుపేట, తెనాలి, A.P. నాకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 1521/2017 (SRO- Tenali) తెనాలి అమరావతి ఫ్లాట్స్ నుండి చెంచుపేట టూ వీలర్‌పై వెళుతుండగా నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్ 9642438313 కు తెలుపగలరు.
AJG-184086

➾ గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, దొప్పలపూడి గ్రామ నివాసి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, మియాపూర్‌కు చెందిన గడ్డిపాటి చక్రధర్ S/o. జంగమయ్యకు చెందిన సర్వే నెంబర్ 224, డాక్యుమెంట్ నెంబర్ 225/1984, ది. 10-01-2024న ఫోటోస్టాట్ కోసం దొప్పలపూడి నుండి పొన్నూరు వెళ్తుండగా మార్గమధ్యలో పోయినది. వెంత వెతికినా దొరకలేదు. దొరికినవారు పై అడ్రస్‌కు పంపగలరు.
AJG-184462

SPOKEN ENGLISH

➾ ఇంగ్లీషు 60 రోజులలో 60 గ॥లతో ఆన్‌లైన్ క్లాసులు, వాట్సప్ ద్వారా మాట్లాడండి రేపటి నుండి 5 రోజుల ఫ్రీ క్లాసులకు హాజరు కండి. సంప్ర॥ ప్రామాణిక, గుంటూరు. సెల్: 94405 39029.
AJG-184463

ఆయుర్వేదం

➾ అంగస్తంభన లేకపోవడం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికౌషధం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా. సిహెచ్. రామకృష్ణ, VJA సెల్: 84650 56299
AJB-896

CHANGE OF NAME

➾ I, BANGARU SATHYANARAYANA SUSEEL (Old Name) W/o BANGARU SATHYANARAYANA R/o Guntur have changed my name to BANGARU SUSEELA (New Name) Henceforth i am being called as BANGARU SUSEELA for all purpose.
AJH-002125

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ల	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్: 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్నా, ఏదైనా నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్



వైసీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని

రానున్నది టీడీపీ ప్రభుత్వమే : అనగాని

రేపల్లె, జనవరి 23 : అధికార పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన రానున్నది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం అడవులదీవి టీడీపీ ఆధ్వర్యంలో భీమావారిపాలేనికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలైన కొండపల్లి నరసింహారావు, సుబ్బరామయ్య, కల్లగుంట్ల రామకృష్ణ, దుర్గారావు, రేమాల శ్రీను, నల్లపాటి పూర్ణచంద్రరావు, దున్నా వినోద్, కేసన సాయిరామ్, నర్రా శ్రీను, నల్లపాటి వసంతరావు, అంగలకుదురు మీరా, వీరంకి సుబ్బారావు, కొప్పుల శ్రీనివాసరావులకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయింది. రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా ప్రజలు బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ఇసుక, మట్టి, మాఫియాలు వైసీపీ నాయకులు పెట్రేగిపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా యువతకు ఉద్యోగ కల్పన కల్పించకపోగా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కూచిపూడి మోహన్‌రావు, మేకా రాజేష్‌కన్నా, శొంఠి శ్రీను, మోర్ల రామ్ ప్రసాద్, సయ్యద్ కరిముల్లా, కేసన కోటేశ్వరరావు, జొన్నా వంశీ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధులు కావాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల,జనవరి 23 : రాబోయే సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీసులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు తప్పనిసరిగా సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రణాళికబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఎన్నికల నియమనిబంధనలు, ప్రవర్తన నియామవాళి, ఎలక్షన్ సంబంధిత చట్టాలు, నేరాలు, అక్రమ ఆయుధాలు, మద్యం, నగదు, ఇతర వస్తువులు సీజ్ చేయు ప్రక్రియ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల సమాచారం సేకరించి అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు గురించి అవగాహన కల్పించారు. మద్యం, ధనం, అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీఎస్పీ టి.వెంకటేశులు, ఎఆర్‌డీఎస్పీ ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ విద్యాశ్రీ, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ యు.సూర్యనారాయణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ మాల కొండయ్య, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణకు సమ్మె నోటీసు అందజేస్తున్న జేఏసీ ఉద్యోగులు

బాపట్ల, జనవరి 23 : డీఆర్‌డీఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సెర్ప్ జేఏసీ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు బాపట్ల డీఆర్‌డీఏ జేఏసీ ఉద్యోగులు మంగళవారం సమ్మె చేశారు. పీడీ సీహెచ్ కృష్ణకు సమ్మె నోటీసును అందజేసిన జేఏసీ నాయకులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పేస్కేల్, కారుణ్య నియామకాలు, హెచ్‌ఆర్‌ఏ పెంపుదల, పదోన్నతులు, ఇంక్రిమెంట్ తదితర సమస్యలు పరిష్కరించాలని జేఏసీ చైర్మన్ తుళ్ళూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి

● బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు

బాపట్ల, జనవరి 23 : రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి దాసరి భాను వెంకట రంగారావు తెలిపారు. బాపట్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారి కిషోర్‌బాబు, డాక్టర్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం



శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయాన్ని తొలగిస్తున్న చిత్రం

బాపట్ల, జనవరి 23 : పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పురాతన దేవాలయం శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. దేవదాయ శాఖ ఈవో డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దేవాలయాన్ని పడగొట్టే పనులు చేపట్టారు. 320 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవాలయాన్ని కోటి 10 లక్షల రూపాయలతో పునఃనిర్మించనున్నారు. ఇప్పటికే శ్రీమత్సుందరవల్లీ శ్రీరాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయ ఆధునీకరణ పనులు పూర్తి చేశారు. తిరిగి సోమేశ్వరస్వామి దేవాలయం పునఃనిర్మించేందుకు దాతలు రూ.25 లక్షల 30వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని సీజీఎఫ్ కాంట్రీబ్యూషన్‌గా చెల్లించారు. మిగిలిన మొత్తం 84.70 లక్షల రూపాయలు దేవదాయశాఖ కేటాయించింది. మొత్తం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. దేవాలయంలోని విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించారు.

దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఇంటర్వ్యూలు

బాపట్ల, జనవరి 23 : జాతీయ వికలాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా 2023-2024 సంవత్సరానికి జీవనోపాధి నిమిత్తం రుణం మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్జున, డీఆర్‌డీఏ, జిల్లా పరిశ్రమల కేంద్రం, పశు సంవర్ధక శాఖ, ఎస్సీ కార్పొరేషన్, మెప్మా, బీసీ కార్పొరేషన్, దివ్యాంగుల వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయంలో నేతాజి జయంతి

బాపట్ల,జనవరి 23 : నేతాజి శుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం బాపట్ల జనసేనపార్టీ కార్యాలయంలో నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆధ్వర్యంలో నేతాజి పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆహర్నిశలు పాటుపడ్డ నేతాజి చిరస్మరణీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

● నేతాజి సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. నేతాజి జయంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జెడ్.బాషా, నర్రా సాంబు, హైమరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చిన సీఎం : ఎంపీటీసీ

కర్లపాలెం, జనవరి 23 : ఎన్నికల్లో చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. నల్లమోతువారిపాలెంలో మంగళవారం జరిగిన గ్రామస్థాయి డ్వాక్రా మహిళల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో డ్వాక్రా మహిళలకు నాల్గొవ విడత ఆసరా నిధులు రూ.కోటి ముప్పై ఆరు లక్షలు మహిళలకు అందించటం సంతోషదాయకమన్నారు. డ్వాకా మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



లోకేశ్ జన్మదిన కేక్‌ను పార్టీ శ్రేణులతో కలిసి కట్ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 23 : బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. యువనేత నారా లోకేశ్ నాయకత్వంలో పార్టీశ్రేణులంతా కలిసి పయనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, నాయకులు విన్నకోట వీరయ్యనాయుడు, తాతా చినబాబు, రమేష్ బాబు, పసుమర్తి యలమంద, షేక్ నజ్మా, కూచిపూడి ఝాన్సీ రాణి, వేమవరపు సుజాత, విజయకుమార్, మందపాటి ఆంద్రేయ, గేరా ఛార్లెస్, కిషోర్, పరీద్‌మస్తాన్, దాసరి యోహాను, ఉప్పాల కృష్ణగౌడ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల మండలంలోని కంకటపాలెంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగుయువత నాయకులు గోపికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్ నాయకత్వంలో తామంతా కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రాయపూడి నాగమల్లేశ్వరరావు, నాయకులు వందనం, మల్లారపు రవీంద్ర, రమేష్, లక్ష్మణ, వంశీదాసు తదితర నాయకులు పాల్గొన్నారు.

● తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని అద్దెపల్లి గణపతి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో బాపట్ల హోప్స్ స్కూల్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ అద్దేపల్లి గణపతి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షులు వైభూపతిరావు, ఎస్సీసెల్ నాయకులు కె.ఏసుదాసు, సలగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని అప్పికట్లలో యువనాయకుడు నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అప్పికట్ల టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్లస్టర్ ఇన్‌చార్జి ఇనగంటి గాంధీ, బూత్ ఇన్‌చార్జి అమర్‌నాథ్, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, ప్రభాకరరావు, సీతారామయ్య, ప్రమోద్, శివన్నారాయణ, శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

● కర్లపాలెం, జనవరి 23 : కర్లపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో బోజ రాజు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, టీడీపీ పార్లమెంట్ నాయకులు నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ బాజి, టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, బెజ్జం వెంకటేశ్వర్లు, కట్టా సుజాత, బొద్దుకూరి విజయ, మహ్మద్ పఠాన్ బాషా, పిట్ల వసంతరెడ్డి, పులుగు సముద్రాలురెడ్డి, దాసు, షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొల్లూరు టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుమ్మడి శివ, కోగంటి శివవెంకటేశ్వరరావు, తలశిల పండుబాబు, రావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 23 : నారా లోకేశ్ నాయకత్వ పటిమను చూసి వైసీపీ నేతల వెన్నులో ఓటమి భయం పుట్టిందని టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము అన్నారు. లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్‌కు ప్రజల్లో ఆదరణ చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నాయకులు జీవీ నాగేశ్వరరావు, తాతా ఏడుకొండలు, ఆలూరి దానియేలు, పి.మల్లికార్జున్‌రావు, పందరబోయిన గోపి, సీతామహాలక్ష్మి, రేపల్లె సురేష్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గోగినేని పట్టాభిరామారావు, కరిముల్లా, దేవగిరి రవిశంకర్, కేసన రామకృష్ణ, డొక్కు బుజ్జి, పంతాని సాయికుమార్, ల్యాబ్ కిషోర్, డొక్కు గోపి, తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● చెరుకుపల్లి, జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రానున్న రోజుల్లో పదవులు అలంకరించాలని నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. చెరుకుపల్లిలో మంగళవారం నారా లోకేష్ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, నాగుల పున్నారావు, పేరం శంకర్, పలు గ్రామాల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● చుండూరు, జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చుండూరులోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. బాపట్ల పార్లమెంటరీ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మొవ్వా శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కేసాని శివకృష్ణ, పరిశ గోపి, ఉడతా దేవేంద్రదర్, బాలాజీ, దేవరపల్లి అనీల్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీశ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న రాధేయ్ గ్రూప్ చైర్మన్ దగ్గుమళ్ళ ప్రసాదరావు



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న దగ్గుమళ్ళ ప్రసాదరావు

అధిష్ఠానం అవకాశం కల్పిస్తే ఎంపీగా పోటీ చేస్తా

● రాధేయ్ గ్రూప్ చైర్మన్ దగ్గుమళ్ళ

● పేదలకు దుస్తులు పంపిణీ

బాపట్ల, జనవరి 23 : అదిష్ఠానం అవకాశం కల్పిస్తే బాపట్ల ఎంపీగా పోటీచేస్తానని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, రాధేయ్‌గ్రూప్ చైర్మన్ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ జన్మదిన వేడుకలను బాపట్ల క్రిస్టియన్ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యువ నాయకులు అంబేద్కర్ సర్కిల్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. లోకేష్ 41వ జన్మదినం సందర్భంగా 41 కిలోల కేక్‌ను కట్ చేశారు. యువనేత తలపెట్టిన పాదయాత్ర 226 రోజులు చేసిన గుర్తుగా 226 మంది మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పార్టీశ్రేణులు ప్రసాదరావును గజమాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ పరిపాలన వ్యవస్థపై పట్టు ఉన్న చంద్రబాబునాయుడు తనయుడు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన ఎన్టీరామారావు మనవడు నారా లోకేశ్ నాయకత్వంలో పనిచేస్తానని స్పష్టం చేశారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక పరిస్థితి మెరుగు పడేవిధంగా పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతానని చెప్పారు. కాల్వల అను సంధానం కోసం కృషి చేసి ఈ ప్రాంత రైతులకు నీటి ఎద్దడి లేకుండా చూస్తానన్నారు. ఇవన్ని చేయటానికి విజన్ ఉన్న చంద్రబాబు అడుగుజాడల్లో పయనించేందుకు తెలుగుదేశంపార్టీలో కొనసాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్, విశ్రాంత సీఈవో జంగం రాజశేఖరరావు, నాయకులు సలగల సురేష్, షేక్ కరీముల్లా, సతీష్, బి.రత్నరాజు, బి.సాల్మన్‌రాజు, పర్చూరు నియోజకవర్గ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు పాల్గొన్నారు.



ప్రసాదరావును గజమాలతో సత్కరిస్తున్న తెలుగుయువత నాయకులు

వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత

బాపట్ల, జనవరి 23 : వైఎస్సార్ ఆసరా నాల్గొవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని 30,609 స్వయం సహాయక సంఘాలకు రూ.238 కోట్ల 30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం మహిళా సంఘాలకు లబ్ధి చేకూరే విధంగా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, డీపీఎం లక్ష్మణచారి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ద్రాక్షావలి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జేసీ శ్రీధర్, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ సునీత

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడిగా కొడాలి

భట్టిప్రోలు, జనవరి 23 : ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడిగా గ్రామానికి చెందిన కొడాలి రామకోటేశ్వరరావు నియమితులయ్యారు. ఇటీవల మంగళగిరిలో రెండు రోజుల పాటు జరిగిన 13వ రాష్ట్ర మహాసభలలో రామకోటేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు సంఘం సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మంగళవారం తెలిపారు. రామకోటేశ్వరరావు ఎన్నికపై చేనేత నాయకులు కె.మోహనరావు, డి.రామారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించనున్నట్లు రామకోటేశ్వరరావు తెలిపారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలకు సన్మానం

కొల్లూరు, జనవరి 23 : తమ న్యాయమైన డిమాండ్ల కోసం 42 రోజులుగా సుదీర్ఘ పోరాటం చేసి విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను సర్పంచ్ కృష్ణమోహన్ సన్మానించారు. మంగళవారం తురకపాలెం, తోకలవానిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమ్మెను వీడి విధుల్లో చేరిన కార్యకర్తలు, ఆయాలను సన్మానించారు. పోరాటంలో పాలు పంచుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలందరికి సీఐటీయూ నాయకులు సుబ్బారావు, అగస్టీన్‌లు ధన్యవాదాలు తెలిపారు.

● వేమూరు, జనవరి 23 : పట్టుదలతో తమ కోరికల సాధన కోసం 42 రోజుల పాటు నిరవధిక సమ్మె నిర్వహించి తమ కోరికలు సాధించుకున్న అంగన్‌వాడీలకు సీఐటీయూ పక్షాన నాయకులు అగస్టీన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన వేమూరులో మంగళవారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ సమ్మెకు ప్రత్యక్షంగా పరోక్షంగా సంఘీభావం ప్రకటించిన వివిధ పార్టీలు, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

● రేపల్లె, జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వకమైన హామిని ఇచ్చిన నేపథ్యంలో సమ్మెను విరమించి విధుల్లోకి వెళుతున్నామని అంగన్‌వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షురాలు కె.ఝాన్సీ అన్నారు. స్థానిక విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాబోయే కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. వివిధ ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించటంపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, నాయకులు డి.జ్యోతి, ఎస్.కృష్ణకుమారి, భవాని, రజని, కేవీ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం

చుండూరు, జనవరి 23 : బాపట్ల సరస్వతి స్మారక బాలికల పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జె.రత్నశ్రీ ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన తెలుగు పండిట్ బి.వి.సుబ్బారావును, విద్యార్థి రత్నశ్రీని ఎంఈవోలు చలపతిరావు, సోలోమన్, పాఠశాల హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● మాజీ మంత్రి ఆనంద్‌బాబు

వేమూరు, జనవరి 23 : వేమూరు నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం సంఘ నేతలకు మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. వేమూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీసీ సంఘం నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి బీసీలను మోసం చేశాడని, సంబంధిత కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయకుండా విస్మరించారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబు నాయుడు బీసీలకు తగిన స్థానం కల్పించారన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని రెండు ప్రచార రథాల ద్వారా ఐదు మండలాల్లో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు తెలుగుదేశం పార్టీ బీసీ విభాగంలోని ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో బీసీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఐదు మండలాల పరిధిలోని పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునా, అంబేద్కర్ భవన్ నిధులు ఎక్కడ?

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా



అంబేద్కర్ భవన్ నిర్మాణ స్థలాన్ని చూపుతున్న సాయిబాబా

భట్టిప్రోలు, జనవరి 23 : మంత్రి నాగార్జున చేతకాని తనం వలనే అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కేటాయించిన రూ.50 లక్షలు నిధులు వమరిగిపోయాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. పోరుబాట-7లో భాగంగా మండలంలోని అద్దేపల్లి దళితవాడలో అంబేద్కర్ భవన్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో అద్దేపల్లి దళితవాడలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. మంత్రిగా ఆనందబాబు మంజూరు చేయించిన నిధులు ఖర్చు పెట్టలేని నిస్సహాయ స్థితిలో ప్రస్తుత మంత్రి నాగార్జున ఉండడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి లేక నియోజకవర్గం వదలి సంతనూతలపాడు వెళ్ళిన మంత్రి అంబేద్కర్ భవన్ గురించి ఏమి మాట్లాడతాడని ఏమి చెయ్యగలరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనపర్తి సుందరరావు, జంగం శ్యాంసన్, యడ్ల జయశీలరావు, కంభం సుధీర్, గొట్టుముక్కల లెనిన్, ఆదిన బసవపున్నయ్య, ఇబ్రహీంబేగ్, ఇర్ఫాన్‌బేగ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట, నాటుసారా బట్టీలు ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

రేపల్లె, జనవరి 23 : తీరప్రాంతంలో నాటుసారా తయారీ చేస్తే ఉపేక్షించేది లేదని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఎస్ఈబీ పోలీస్ అధికారులు నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ అదవల గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 350 లీటర్ల బెల్లపు ఊట, నాటుసారా తయారీ చేస్తున్న బట్టీలను ధ్వంసం చేయటం జరిగిందన్నారు. అదవల గ్రామ శివారులో మడ అడవుల్లో నాటుసారా తయారీ చేస్తున్న బట్టీలను గుర్తించి ధ్వంసం చేయటం జరిగిందని తెలిపారు. నాటుసారా తయారీ చేసినా, అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచి విక్రయిస్తున్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె పట్టణ సీఐ ఎన్.నజీర్‌బేగ్, ఎస్ఐలు వెంకట రవి, రమేష్, వై.సురేష్, డి.రామకృష్ణ, ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

నగరం, జనవరి 23 : నాటుసారా తయారీ బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరం సెబ్ సీఐ ఆర్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా నాయుడుపేటలో సెబ్ సీఐగా విదులు నిర్వహిస్తూ బదిలీపై నగరం సెబ్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సెబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా బెల్టుషాపులు, అక్రమ మద్యం నిల్వ ఉంచినా, అనుమతులు లేకుండా ఇసుక, మైనింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రస్తుతం నగరంలో పని చేస్తున్న సెబ్ సీఐ నెల్లూరు జిల్లా వాకాడకు బదిలీపై వెళ్ళారు.

ఇటుక బట్టీల యజమానులకు సినరేజ్ కష్టాలు

● చర్చలకు వచ్చిన ఎంఆర్ ప్రతినిధులు, మైనింగ్ ఆర్ఐ



సమావేశంలో ఏఎంఆర్ ప్రతినిధులు, మైనింగ్ ఆర్ఐ

కొల్లూరు, జనవరి 23 : కంకర, మట్టి, గ్రావెల్ తదితర వాటిపై సినరేజ్ వసూలు బాధ్యతలు ప్రభుత్వం మైనింగ్ శాఖ నుంచి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో ఆ కంపెనీ ప్రతినిధులు ఇటుక బట్టీల యజమానులతో కూడా సినరేజ్ చెల్లించాలంటూ చర్చలు జరిపారు. కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం సినరేజ్ విషయం బాధ్యత తీసుకున్న ఏఎంఆర్ కంపెనీ ప్రతినిధులు మైనింగ్ శాఖ ఆర్ఐను వెంట పెట్టుకు వచ్చి బట్టీల యజమానులతో ఒక్కొక్క బట్టీ రూ.8 వేలు చెల్లించాలని ప్రతిపాదనలు చేశారు. మొత్తం 220కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయని వాటన్నింటికి ఒక్కొక్క బట్టీకి రూ.8 వేలు చెల్లించాలని కంపెనీ ప్రతిపాదించిందని, ఆ మొత్తాన్ని చెల్లించాలని కోరగా, ఇటుక బట్టీ యజమానులు గతంలో మైనింగ్ శాఖ ఆర్‌సి మంజూరు చేసి సంవత్సరానికి రూ.8 వేలు తీసుకునేదని, ఈ సంవత్సరం రెన్యువల్ చేయలేదన్నారు. మీరు సినరేజ్ వసూలు బాధ్యతలు తీసుకున్నారని చెబుతున్నారని గతంలో మాదిరిగా మా లైసెన్స్‌లు రెన్యువల్ చేసి రూ.8 వేలు కట్టించుకోవాలని కోరగా అలా కుదరదని నెలకు ఉమ్మడి జిల్లా మొత్తం మీద ప్రభుత్వానికి మైనింగ్ శాఖ తరఫున సినరేజ్ పన్నుల నిమిత్తం రూ.10.50 కోట్లు చెల్లించాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. మీరు చెప్పిన ప్రతిపాదన తమ కంపెనీ యజమానులతో చర్చిస్తామని అయితే ఆర్‌సికి రూ.8 వేలు చెల్లించడం సరికాదన్నారు. దీంతో ఇటుక బట్టీల యజమానులు మండలం మొత్తం ఎన్ని కల్లాలు ఉన్నాయని లెక్క వేసి ముఠాకు రూ.8 వేలు నుంచి రూ.11 వేలు వరకు చెల్లించడానికి అభ్యంతరం లేదని, బట్టీకి రూ.8 వేలు చెల్లించాలంటే తమ వల్ల కాదని, ఇటుక ఉత్పత్తిలో సాధకబాధకలను కంపెనీ ప్రతినిధులకు వివరించారు. దీంతో మీకు భారం లేకుండా మా కంపెనీ యజమాన్యంతో చర్చిస్తామని ప్రతినిధులు ఇటుక పరిశ్రమదారులకు తెలియజేశారు.

భర్తీపూడిలో పోలీస్ పికెట్ ఏర్పాటు

బాపట్ల, జనవరి 23 : భర్తీపూడి గ్రామంలో కొన్ని రోజుల క్రితం ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీ, వైసీపీ వర్గీయులపై పరస్పర కేసులు నమోదయ్యాయి. మంగళవారం టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ వర్గీయులు వివాదాలకు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో బాపట్ల రూరల్ పోలీసులు గ్రామంలో పికెట్‌ను ఏర్పాటు చేశారు.

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ)- బీఈడీ(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. దీనిని తెలుగు మాధ్యమంలో చదవాలి. అభ్యర్థులు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్ పెడగాగీలలో ఒకదాన్ని ఎంచుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లో పది సెంటర్లు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఒక్కో సెంటర్లో 50 సీట్లు చొప్పున మొత్తం 500 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు యూజీసీ, ఎన్‌సీటీఈ గుర్తింపులు ఉన్నాయి.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఈడీ



ప్రోగ్రామ్ సెంటర్లు

- ఆంధ్ర మహిళ సభ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్.
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, హన్మకొండ, వరంగల్
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్, కర్నూలు.
- ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, బ్రాడిపేట్, గుంటూరు
- గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, మునసబ్‌పేట్, శ్రీకాకుళం.
- బ్రౌన్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఖమ్మం
- ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అండ్ ఎగ్జిబిషన్ సొసైటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, పరిగి, వికారాబాద్
- అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రాజంపేట, కడప
- వాణి నికేతన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ముకరంపుర, కరీంనగర్


అర్హత

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీసీఏ/బీఎస్సీ-హోం సైన్స్/బీబీఎం/బీబీఏ/బీఈ/ బీటెక్/ఎంఏ/ఎంకాం/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్‌లోని పెడగాగీని అనుసరించి ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/ఫిజికల్ సైన్సెస్‌అలైడ్ మెటీరియల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/సోషల్ సైన్సెస్ చదివి ఉండాలి. అభ్యర్థులు 2023 జూలై నాటికి డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి.
- ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఇన్ సర్వీస్ టీచర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ లేదా ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఫేస్ టు ఫేస్ మోడ్‌లో పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.
- ఎంబీబీఎస్/బీడీఎస్/బీపీటీ/బీఏఎంఎస్/బీఎల్/ఎల్ఎల్‌బీ/బీఫార్మసీ/బీహెచ్ఎంటీ/బీవీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/బీఏ లాంగ్వేజెస్/బీఓఎల్/ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారు; డిప్లొమా(ఈసీఈ/పీఎస్ఈ) ఉత్తీర్ణులు; ప్రీ ప్రైమరీ టీచర్ ట్రెయినింగ్ సర్టిఫికెట్/డిప్లొమా(పీపీటీటీసీ) పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ నుంచి 25, రెండో పార్ట్‌లో ప్రొఫిషియెన్సీ ఇన్ తెలుగు నుంచి 25, మూడో పార్ట్‌లో జనరల్ మెంటల్ ఎబిలిటీ నుంచి 50 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం పూర్తిగా తెలుగు మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 35 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.40,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 5
- **వెబ్‌సైట్:** www.braouonline.in

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఏ, ఎంటెక్



వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)- ఎంసీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. వెల్లూరు, చెన్నై, భోపాల్ క్యాంపస్‌లలో ఈ రెండు ప్రోగ్రామ్‌లు; ఏపీ క్యాంపస్‌లో ఎంటెక్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉన్నాయి. సంస్థ నిర్వహించే మాస్టర్స్ ఎంట్రెన్స్ టెస్ట్(వీఐటీఎంఈఈ) 2024, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ అర్హత ఉన్నవారికి ఏఐసీటీఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: బయోటెక్నాలజీ, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సీఎస్ఈ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్/బిగ్ డేటా అనలిటిక్స్/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్), ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఇంటెలిజెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఐఓటీ అండ్ సెన్సార్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, క్యాడ్/క్యామ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, స్మార్ట్ మొబిలిటీ.

అర్హత వివరాలు: ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఎస్సీ(సీఎస్)/బీసీఏ/బీఎస్సీ(ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఎంబీబీఎస్/ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)/ఎంవీఎస్సీ/ఎంసీఏ/ఎంఎస్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వీఐటీఎంఈఈ 2024: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో టెక్నికల్ సబ్జెక్ట్ నుంచి 80, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఎంసీఏలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ కంప్యూటర్ సంబంధిత అంశాలనుంచి 80; ఇంగ్లీష్ కమ్యూనికేషన్ అంశాల నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఎంటెక్ టెక్నికల్ సబ్జెక్టులు:** బయో మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయోటెక్నాలజీ, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మసీ, ఫిజిక్స్

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 28
- **వీఐటీ ఎంఈఈ 2024 తేదీ:** మే 5
- **ఫలితాలు విడుదల:** ఎంటెక్‌నకు మే 15న; ఎంసీఏకు మే 17
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఎంటెక్‌నకు మే 15 నుంచి 17 వరకు; ఎంసీఏకు మే 17, 18
- **సీట్ల కేటాయింపు:** ఎంటెక్‌నకు మే 27న; ఎంసీఏకు మే 29న
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఎంసీఏకు జూన్ 10; ఎంటెక్‌నకు జూన్ 21
- **వెబ్‌సైట్:** www.vit.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/46mDoFmలో చదవండి.

SCHOLARSHIP ALERT

Technip Energies India Scholarship Program

Description: Technip Energies India invites applications from female students coming from Delhi NCR (Ghaziabad, Noida, Gurugram, Faridabad), Bihar, Assam, Rajasthan, Tamil Nadu, Gujarat and Maharashtra who are currently enrolled in the first-year of B.E./B.Tech. courses.

Eligibility: Open for female students from Delhi NCR (Ghaziabad, Noida, Gurugram, Faridabad), Bihar, Assam, Rajasthan, Tamil Nadu, Gujarat and Maharashtra.

- Applicants must be currently enrolled in the first-year of B.E./B.Tech. (Chemical, Electrical, Civil, and Mechanical Engineering) courses.
- Must have scored 70% or more marks in Class 12.
- Annual family income of the applicant must not be more than INR 4,00,000 from all sources.

Prizes & Rewards: INR 30,000
Last Date to Apply: 31-01-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TSPSS4

Disha Scholarship Program

Description: An initiative of Birlasoft to offer financial assistance and support to individuals, facilitating their educational pursuits and ensuring the successful completion of their academic journey.

Eligibility: Only Female students

- Students domiciled in Delhi NCR or Pune enrolled in the first year of General/Professional Undergraduate courses at premier NIRF institutions or accredited universities and colleges across India.
- Candidates must have 75% in aggregate or an equivalent CGPA in the Grade 12 board examination in the previous academic year from Delhi NCR and Pune, Maharashtra.
- The annual family income of the applicants from all sources must not exceed INR 5 lakh.
- Applicants must fall within the age bracket of 17 to 29 years.

Prizes & Rewards: Up to INR 25,000 annually
Last Date to Apply: 05-02-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPSP1

Colgate Keep India Smiling Scholarship Programme

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in any year of the BDS (Bachelor of Dental Surgery) course in a recognised government or private institute in Maharashtra, Goa, Gujarat, Himachal Pradesh, and Andhra Pradesh. Applicants must have scored at least 60% marks in Class 12. The annual family income of the applicants from all sources must not exceed 8 lakh.

Prizes & Rewards: Financial assistance of 75,000
Last Date to Apply: 31-01-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/KSSI3

buddy4study.com

జాబ్ కార్నర్

టీఎస్ఆర్టీసీలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ టీఎస్ఆర్టీసీ రీజియన్లు(డిపో/యూనిట్)లో నాన్ ఇంజనీరింగ్ విభాగంలో అప్రెంటిస్ శిక్షణకు ప్రకటన విడుదల చేసింది. **మొత్తం ఖాళీలు: 150**

అర్హత: బీకాం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీసీఏ కోర్సు 2018, 2019, 2020, 2021, 2022, 2023లో ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు విధానం: దరఖాస్తు సమర్పణకు ముందు http://www.nats.education.gov.in/ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు వివరాలను నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: https://www.tsrtc.telangana.gov.in/

ఎన్ఎండీసీలో మేనేజర్లు

హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ సీఎస్ఆర్ ఫౌండేషన్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 16**

1. హెడ్-ఎన్ఎండీసీ సీఎస్ఆర్ ఫౌండేషన్: 1 పోస్టు
2. ప్రాజెక్ట్ మేనేజర్: 1 పోస్టు
3. మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్: 1 పోస్టు
4. ఆఫీస్ మేనేజర్: 1 పోస్టు
5. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లు: 7 పోస్టులు
6. బ్లాక్ కో ఆర్డినేటర్లు: 5 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31

వెబ్‌సైట్: www.nmdc.co.in/

నవ్య | చిత్రజ్యోతి

మిస్ పర్ఫెక్ట్‌గా ఉన్న నేను మిసెస్ పర్ఫెక్ట్‌నయ్యా



'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజున మా సిరీస్ ట్రైలర్ రిలీజ్ కావడం ఆనందంగా ఉంది. ఈ సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. కానీ పూర్తయ్యే లోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యా. దీనికి ముందు నేను చేసిన కొన్ని ప్రాజెక్టుల వల్ల అలసిపోయా. అలాంటి టైమ్‌లో 'మిస్ పర్ఫెక్ట్' లాంటి స్ర్కిప్ట్ దొరకడం నాకు పెద్ద రిలీఫ్' అన్నారు లావణ్య. ఆమెతో పాటు అభిజిత్, అభిజ్ఞ కీలక పాత్రలు పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ ఫిబ్రవరి 2న డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అన్నపూర్ణ స్టూడియో బేనర్‌పై సుప్రియ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. సోమవారం రాత్రి జరిగిన ప్రెస్‌మీట్‌లో సిరీస్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ 'సుప్రియ గారితో 'సోగ్గాడే చిన్నినాయన' చిత్రం చేశాను. అది హిట్ అయింది. ఈ సిరీస్ కూడా హిట్ కావాలి. మా దర్శకుడు విశ్వక్ దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నా' అన్నారు. దర్శకుడు విశ్వక్ మాట్లాడుతూ 'లావణ్య 'అందాల రాక్షసి' చిత్రంలో ఎలాంటి పెర్ఫార్మెన్స్ ఇచ్చారో అటువంటి నటనే ఈ సిరీస్‌లో కావాలనుకున్నా. అలాగే అభిజిత్ నటించిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చూశాను. ఆడిషన్ ఇవ్వాల్సిన అవసరం తనకు లేకున్నా ఈ సిరీస్ కోసం ఆడిషన్ ఇచ్చాడు. షూటింగ్ టైమ్ సరదాగా గడిచింది' అని చెప్పారు. నిర్మాత సుప్రియ మాట్లాడుతూ 'కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం అంటే నాగార్జునగారికి, తాతగారికి ఇష్టం. అందుకే అన్నపూర్ణ సంస్థ పెట్టారు. చాలా మంది కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. చాలా మంది అమ్మాయిలు నో చెప్పిన పాత్రను నేను చేస్తానంటూ ముందుకు వచ్చి తన గట్స్ ఏమిటో ప్రూవ్ చేసింది అభిజ్ఞ. అభిజిత్ తన పాత్ర బాగా చేశాడు. మిస్ పర్ఫెక్ట్ కు లావణ్య పర్ఫెక్ట్. ఒక చిన్న కథలో బలమైన పాత్రలు ఉండి మిమ్మల్ని ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభిజిత్, రోషన్, కేశవ్, మహేశ్ విట్టా, అభిజ్ఞ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ అదీప్ అయ్యర్ తదితరులు కూడా మాట్లాడారు.

స్వేచ్ఛ, ఆత్మగౌరవాలకు అద్దం పట్టే కెప్టెన్ మిల్లర్

జాతీయ ఉత్తమనటుడు ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ నెల 26న తెలుగులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మీడియాతో ముచ్చటించారు.



'కెప్టెన్ మిల్లర్' ఆలోచన నాకు పదేళ్లక్రితమే మొగ్గ తొడిగింది. కథ రాస్తున్నప్పుడు తెలీకుండానే కథానాయకుడిగా ధనుష్ నా మస్తిష్కంలో మెదిలాడు. కథ పూర్తవ్వగానే ఆయన్ను కలిశాను. తనకు కూడా కథ బాగా నచ్చింది. అలా 'కెప్టెన్ మిల్లర్' మొదలైంది. బ్రిటిష్ ఆర్మీలో పనిచేస్తున్న భారతీయ సైనికుడి కథ ఇది. ధనుష్ అద్భుతమైన నటన కనబరిచాడు. ఆయనతో పనిచేయడం గొప్ప అనుభవం.


- ఇది చిత్రమైన కథ. 40శాతం యాక్షన్ ఉంటుంది. మిగతా అంతా హీరో ప్రయాణమే. ఇదొక ప్యూర్ డ్రామా. ప్రేక్షకులు తమకు తాము ఐడెంటిఫై చేసుకునేలా ఇందులో పాత్రలు ఉంటాయి. పాత్రధారులంతా ఒదిగిపోయి నటించారు. ఇందులోని ఓ కీలక పాత్రలో శివరాజ్‌కుమార్ నటించారు. ఆయన పాత్ర సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది. కన్నడ బ్లాక్‌బాస్టర్ 'ఓం'లోని శివన్న నటనను మళ్లీ ఈ సినిమా గుర్తుచేస్తుంది. ఆయన లుక్, స్ర్కీన్ ప్రెజన్స్ అద్భుతం. శివన్న పాత్ర ప్రేక్షకులకు ఓ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.
- ప్రియాంక అరుళ్ మోహన్ ఇందులో కొత్తగా కనిపిస్తుంది. పూర్తిగా అభినయానికి అవకాశం ఉన్న పాత్రను ఇందులో ఆమె చేసింది. అలాగే సందీప్‌కిషన్ కూడా మంచి పాత్ర చేశారు. జీవీప్రకాశ్ సంగీతం, ముఖ్యంగా నేపథ్యసంగీతం ఈ సినిమాకు హైలైట్. 1930లో జరిగే కథ ఇది. అందుకే కెమెరా డిపార్ట్‌మెంట్‌తోపాటు, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ కూడా చాలా శ్రమించాల్సివచ్చింది. సాంకేతికంగా నెక్స్ట్ లెవల్లో సినిమా ఉంటుంది. కెప్టెన్ మిల్లర్ స్వేచ్ఛ, ఆత్మగౌరవం గురించి చర్చించే కథ. అందరికీ నచ్చుతుందని నా నమ్మకం.

పెళ్లికి ముందు...



యూత్‌ను ఎట్రాక్ట్ చేసే కథతో పాటు మంచి సందేశం ఇస్తూ నిర్మించిన 'బిఫోర్ మ్యారేజ్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. సీనియర్ నిర్మాత వై.నాగేశ్వర రెడ్డి తనయుడు ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి తీసిన సినిమా ఇది. భరత్, నవీనా రెడ్డి జంటగా నటించిన ఈ చిత్రానికి శ్రీధర్ రెడ్డి అటాకుల దర్శకత్వం వహించారు. మంగళవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'లేడీ ఓరియంటెడ్ సినిమా ఇది. హీరోయిన్ బాగా చేసింది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరించాలి' అని కోరారు. 'పెళ్లికి ముందు తప్పు అనిపించని పొరపాటు ఆ తర్వాత జీవితంలో ఊహించని మార్పులకు కారణం అవుతుంది. అదే విషయాన్ని ఈ చిత్రంలో చెప్పాం. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు దర్శకుడు. ఇంకా నిర్మాత కూడా మాట్లాడారు.

ఆకట్టుకునేలా అరి



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధానపాత్రలు పోషిస్తున్న చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మాతలు. ఇందులోని సూర్య పురిమెట్ల పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూర్య పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, కథ, కథనం, సంగీతం అన్ని అంశాలూ ఆకట్టుకునేలా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని విడుదల చేయడంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానుందని సమాచారం. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. వైవా హర్ష, శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేఖ సుధాకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కృష్ణప్రసాద్, శివశంకరప్రసాద్, సంగీతం: అనూప్ రూబెన్స్.

తెలుగులోనే కాదు ఏ భాషలోనూ రాని సినిమా



ఒకప్పటి చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ 'సిద్దార్థ్ రాయ్' చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి దర్శకుల దగ్గర పనిచేసిన వి.యశస్వీ ఈ సినిమాకు దర్శకుడు. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మాతలు. మంగళవారం ఉదయం జరిగిన వేడుకలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ "సిద్దార్థ్ రాయ్' వంటి సినిమా తెలుగులోనే కాదు ఏ భాషలోనూ రాలేదు. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు. దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'ఈ కథ విని ఆశ్చర్యపోయా. ఇలాంటి కథ తీయాలన్నా, అలాంటి పాత్ర చేయాలన్నా గట్స్ కావాలి. ఈ విషయంలో దీపక్ చాలా లక్కీ' అన్నారు. 'విలన్ లేకుండా హీరో ఉండడు. ఈ సినిమా ఫస్ట్‌హాఫ్ విలన్ అయితే, సెకండాఫ్ హీరో. కథ వినగానే అలా అనిపించింది. ఇలాంటి కథతో సమాజానికి ఏం చెప్పదలుచుకున్నావ్ అని దర్శకుడు యశస్వీని కోప్పడ్డాను. కానీ చాలా అద్భుతంగా సినిమాను తీర్చిదిద్దారు' అన్నారు రచయిత లక్ష్మీ భూపాల. 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' వంటి చిత్రాల కోసం ఆకలితో ఎదురు చూసే ప్రేక్షకులకు మూడో చిత్రం 'సిద్దార్థ్ రాయ్' అని మరో దర్శకుడు వీరశంకర్ చెప్పారు. 'ఈ సినిమాలో పాత్ర గురించి, దాన్ని ఎందుకు చేశానో తర్వాతి వేడుకల్లో మాట్లాడతా' అన్నారు హీరో దీపక్ సరోజ్.

హనుమాన్ విశ్వరూప విజువల్స్‌ని సవాలుగా తీసుకున్నా..



'అసాధారణ విజయాన్ని అందుకున్న 'హను-మాన్' చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడిగా పనిచేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం' అని విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు ఉదయకృష్ణ అన్నారు. ఆయన విజువల్స్ ఎఫెక్ట్స్ అందించిన 'హను-మాన్' చిత్రం ఎంతటి ఘనవిజయాన్ని అందుకుందో తెలిసిందే. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తేజా సజ్జా కథానాయకుడిగా కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం వసూళ్ల పరంగా 200కోట్ల మైలరాయిని దాటి, ఇంకా అదే ఊపును కొనసాగిస్తోంది. ఈ సినిమా విజయం సాధించడం పట్ల ఉదయ్‌కృష్ణ ఆనందం వెలిబుచ్చారు. విజువల్ ఎఫెక్ట్స్ వినియోగించుకోవడంలో ఎస్.ఎస్.రాజమౌళీ సరసన సగర్వంగా నిలిచేంత ప్రతిభ ప్రశాంత్‌వర్మలో పుష్కలంగా ఉందని ఉదయ్‌కృష్ణ పేర్కొన్నారు. రెండేళ్లుగా తన జీవితంలో అంతర్భాగంగా మారిపోయిన సినిమా 'హనుమాన్'. ఈ చిత్ర విజయం పడిన శ్రమంతా మరిచిపోయేలా చేసిందని ఆయన అన్నారు. ఈ సినిమాకోసం తను ఫేస్ చేసిన పెద్ద ఛాలెంజ్ పతాక సన్నివేశంలో హనుమంతుని విశ్వరూపమని, దర్శకులు కలలు గనే ఎంత గొప్ప విజువల్ అయినా సునాయాసంగా సాకారం చేసే సామర్థ్యం తనకుందని ఉదయ్‌కృష్ణ చెబుతున్నారు.

యదార్థ సంఘటనల మూడోకన్ను



అమెరికాలో యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'మూడోకన్ను'. సాయికుమార్, శ్రీనివాసరెడ్డి, నిరోషా, వీరశంకర్, కాశీవిశ్వనాథ్, మాధవిలత ఇందులో ప్రధానపాత్రధారులు. నాలుగు కథలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దర్శకులు కూడా నలుగురు కావటం విశేషం. సూరత్ రాంబాబు, కె.బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయిసురేంద్రబాబు ఈ చిత్రానికి దర్శకులు. కె.వి.రాజమహి, సునీత రాజేందర్ దేవులపల్లి నిర్మాతలు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ చేతులమీదుగా ఘనంగా విడుదల చేశారు. సినిమా విజయం సాధించి అందరికీ మంచి పేరు తీసుకురావాలని శ్రీకాంత్ శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు. ఈ నెల 26న ఈ సినిమా విడుదల కానుంది.

రొమాంటిక్ హనీమూన్ ఎక్స్‌ప్రెస్



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా రూపొందుతోన్న చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాలరాజశేఖరుని దర్శకుడు. కె.కె.ఆర్, బాలరాజ్ నిర్మాతలు. కల్యాణీమాలిక్ స్వరపరిచిన 'నిజమా..' అంటూ సాగే ప్రేమ గీతాన్ని రామ్‌గోపాల్‌వర్మ చేతులమీదుగా విడుదల చేశారు. 'నిజమా' పాట మెలోడియస్‌గా ఉందని, చాలా బాగా తీశారని, కెమెరా వర్క్ సూపర్ అని రామ్‌గోపాల్‌వర్మ అభినందించారు. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. విభిన్న కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోందని దర్శకుడు చెప్పారు. సుహాసిని, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శిష్టా వి.ఎమ్.కె.

ఎన్నికల ప్రయోజనం కోసమే యాత్ర 2

నట్టి కుమార్

లోక్‌సభ ఎన్నికల తర్వాతే రాజకీయ కథాచిత్రం 'యాత్ర 2'ను సెన్సార్ చేయాలని నిర్మాత, పంపిణీదారుడు, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు నట్టి కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సెన్సార్ బోర్డ్ ఛైర్ పర్సన్‌కు, హైదరాబాద్ ప్రాంతీయ సెన్సార్ అధికారికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. పార్టీకి, ఆ పార్టీ నేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలంగా ఈ సినిమా తీశారని నట్టి కుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత సోనియా గాంధీకి వ్యతిరేకంగా తీయడంతో పాటు వారి పాత్రలను కించపరుస్తూ వ్యంగ్యంగా ఈ సినిమాలో చిత్రీకరించారని ఆయన వివరించారు. తాజాగా పబ్లిసిటీ కోసం విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్ ఇందుకు ఓ ఉదాహరణ అనీ నట్టి కుమార్ వెల్లడించారు. సోనియా గాంధీని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడుని చులకన చేసి చూపించడం వెనుక త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం పొందాలన్న ఉద్దేశం కనిపిస్తోందని తెలిపారు. సెన్సార్ ఇంకా చేయకుండానే ఫిబ్రవరి 8న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారనీ, సెన్సార్ మార్గదర్శకాలకు ఇది విరుద్ధమనీ, దీనిపై కూడా చర్య తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను కుమార్ కోరారు. చిత్రంలోని పాత్రలు ఎవరి మనోభావాలు దెబ్బ తినకుండా, వ్యంగ్యంగా, అవమానకరంగా , కుట్రపూరితంగా లేకుండా చూసి సెన్సార్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా లోక్‌సభ ఎన్నికల ముందు 'యాత్ర 2' విడుదలైతే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతూ, . ఇలా తమ నాయకులను కించపరిచే సన్నివేశాలతో ఎన్నికల ముందు ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్రయత్నిస్తే లీగల్‌గా ముందుకు వెళ్తానని నట్టి కుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AI83fT5 లో చదవండి.


రాజకీయపార్టీల నేతలతో మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటనారాయణ

అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం

» ఈఆర్‌వో వెంకటనారాయణ

పర్చూరు, జనవరి 23: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని పర్చూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్‌వో) వెంకటనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా మండలాల రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్‌వో మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలోని 295 పోలింగ్ బూత్‌లకు సంబంధించి రాజకీయపార్టీల నేతలకు అందజేసినట్లు చెప్పారు. ఫాం 6, ఫాం 7, ఫాం 8కు సంబంధించి జనవరి 5, 2024 తరువాత వచ్చిన 1074 దరఖాస్తులను విచారణ చేపడతామన్నారు. ఓటర్ల తొలగింపునకు సంబంధించి ఫాం 7 ద్వారా తప్పుడు దరఖాస్తు పెట్టిన 55 మందిపై చార్జిషీట్ దాఖలు చేసినట్టు చెప్పారు. ఈసందర్భంగా టీడీపీ యద్దనపూడి మండల అధ్యక్షుడు రంగయ్య చౌదరి మాట్లాడుతూ 22మంది పేర్లు మాత్రమే చార్జిషీట్ దాఖలు చేసినట్లు వచ్చాయని, మిగిలిన 33 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్ బూత్‌ల వారీగా పూర్తిస్థాయి వివరాలు సేకరించి జిల్లా ఎస్పీకి అందజేసి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆయా మండ లాల తహసీల్దార్‌లు సంధ్యశ్రీ, వెంకటరత్నం, సుజాత, బ్రహ్మయ్య, రవికుమార్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు


ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, తదితరులు

మార్టూరు, జనవరి 23: టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పుట్టినరోజు ఈనెల 26వతేదీ కాగా, ముందస్తుగా పలువురు నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏలూరికి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చేత కేక్ కట్ చేయించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ క్యాంపు కార్యాలయానికి వచ్చి ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఏలూరితో కేక్ కట్ చేయించి శుభా కాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రికి ఏలూరి హైదరాబాదు వెళ్లిపోయారు.

యద్దనపూడి మండలం పోలూరి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్యటించారు. పార్టీ నాయకుడు రావిపాటి సీతయ్య ఇంటికి వెళ్లారు. గ్రామంలోని పలువురితో మాట్లాడారు. అనంతరం మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాకానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రవికుమార్


కాకాని హనుమంతరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 23: వ్యాపారవేత్త, టీడీపీ నాయకుడు కాకాని హనుమంతరావు(74) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన ఆయన సుమారు 50 సంవత్సరాలుగా వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు అశోక్ టీడీపీ నేతగా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. సోమవారం రాత్రి కూడా కాకానిపాలెం లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హనుమంతరావు మంగళవారం ఉదయం గుండెనొప్పి రావటంతో హుటాహుటీన ఒంగోలు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హనుమంతరావు మృతదేహం వద్ద ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

పంగులూరు మండలం కొండమంజులూరుకు చెందిన చొప్పరపు మోజేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ఉంచగా ఎమ్మెల్యే రవికుమార్ మంగళవారం సాయంత్రం నివాళులర్పించారు. పట్టణంలోని శ్రీనగర్‌లో ప్రముఖ మహిళాన్యాయవాది ఫణీంద్రాదేవి ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు.


డిపో అధికారులు మొండివైఖరి విడనాడాలి

అద్దంకిటౌన్, జనవరి 23: ఆర్టీసీ డిపో డీఎం, అసిస్టెంట్ డీఎంలు మొండి వైఖరి మానుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ పి.చిరంజీవి అన్నారు. కార్మికుల పట్ల డిపో అధికారులు నిర్లక్ష్యవైఖరికి నిరసనగా ఎంప్లాయీస్ యూనియన్ అధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 3వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో సర్వీసులను ఇష్టం వచ్చినట్లు రద్దు చేస్తున్నారన్నారు. కనీసం కార్మికులకు మంచినీటి వసతిని కల్పించలేకపోయరన్నారు. ఆ రోగ్యం బాగాలేని కార్మికులకు సెలవులు ఇవ్వకపోగా వారికి ఆప్‌సెంట్‌లు వేసి అక్రమంగా చార్జీషీట్లు ఇస్తున్నారన్నారు.

ఈ దీక్షలలో కేజీ రావు, ఎస్‌కే ఎండీ రఫీ, ఎం.వెంకటేశ్వర్లు, కె.కొండలు పాల్గొనగా, మహిళా ఉద్యోగులు, గ్యారేజీ కార్మికులు సంఘీభావం తెలిపారు.

ఆగిఉన్న కారును ఢీకొన్న బైక్

మేదరమెట్ల, జనవరి 23: మేదరమెట్ల బైపాస్‌లో ఆగి ఉన్న కారును మోటార్‌సైకిల్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. మంగళవారం మేదరమెట్ల నుంచి గుంటూరువైపు వెళ్లే మార్గంలో ఫైలాన్ వద్ద ఆగి ఉన్న కారును అదేమార్గంలో వెళుతున్న బైక్ వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా పామూరు మండలం బోడవాడకు చెందిన రావి వెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలయ్యా యి. క్షతగాత్రున్ని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అద్దంకిలో రియల్ ధమాల్

» టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న సర్వేలతో రాజధాని వైపు వ్యాపారుల పరుగులు

» వైసీపీ సానుభూతిపరులైన వ్యాపారులు సైతం కొనుగోళ్లు

అద్దంకి, జనవరి 23: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధి కారంలోకి వస్తుందన్న సర్వేలతో అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాజధాని వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో అద్దంకి లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడకేసింది. అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు తెలుగు రాష్ట్రాలలో అన్ని ప్రాంతాలలో స్థలాల వ్యాపారం చేస్తుంటారు. స్థలాల ధరలు ఎక్కడ పెరిగే అవకాశం ఉంటే అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ వాలిపోతుంటారు.

ఈక్రమంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతుందన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు విజయవాడ-గుంటూరు మధ్య, రాజధాని ప్రాంత గ్రామాలలో తిరిగి స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభాల బాటలోకి వెళ్ళటంతో మరికొంత మంది కూడా వెళ్ళివస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గుంటూరు, విజయవాడ, రాజధాని ప్రాంతాలు పూర్వవైభవం వైపు అడుగులు పడతాయన్న అంచనాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండంత ఆశతో ఉన్నారు. వైసీపీ సానుభూతిపరులుగా ఉన్న పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం రాజధాని ప్రాంతంలో కొనుగోళ్ళు చేసేందుకు పరుగులు తీయటం అద్దంకి ప్రాంతంలో చర్చనీ ‘హంశం గా మారింది.

రాజధాని ప్రాంతంలో స్థలాల ధరలు సంక్రాంతి నాటికి మరింత ధరలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే కొనుగోలు చేసి అమ్మకాలకు సిద్ధం అయ్యారు. ఎన్నికలు సమీపించే కొద్ది రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో అద్దంకి ప్రాంత రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. దీంతో అద్దంకిలో గత ఏడాదిగా అంతంత మాత్రంగా స్థలాల ధరలు ఉండగా రియల్ వ్యాపారులు మొత్తం రాజదానివైపు పరుగులు తీస్తుండటంతో అద్దంకిలో రియల్ వ్యాపారం పూర్తిగా నిలిచిపోయింది.

ఘనంగా లోకేష్ జన్మదినం


చీరాల: భోజనం వడ్డిస్తున్న కొండయ్య తదితరులు

చీరాల, జనవరి 22: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బీసీ సెల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల్లో కొండయ్య పాల్గొన్నారు. మధ్యాహ్నం వేటపాలెం లో సీనియర్ నాయకుడు సజ్జా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల్లో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు భోజనాలు ఏర్పాటు చేశారు. దేశాయిపేట, చీరాల మహిళా మండలి వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు భోజన సదుపాయం కల్పించారు. సాయంత్రం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా సందర్భాల్లో కొండయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వర రావు, సజ్జా వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఆయా కార్యక్రమాలో నాయకులు ఎం. గౌరీ అమర్‌నాద్, నాశిక వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ చినగంజాం గ్రామ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి మోహన్‌రావు కేకు కట్ చేశారు.

కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, సందు శ్రీనివాసరావు, అజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాస రావు, షేక్ జిలాని, తదితరలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

» కోరం లేక గంట ఆలస్యంగా ప్రారంభం

» గంటన్నరకే ముగిసిన వైనం


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం

బల్లికురవ, జనవరి 23: మూడు మాసాలకు ఒకసారి గ్రామాలలో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారంపై సమీక్షతో చేపట్టాల్సిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఉదయం 11 గంటలకు సమావేశమని అజెండాలో పేర్కొన్నారు. మెత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను అయిదుగురే సమావేశానికి రావటంతో కోరం కావటానికి కొంత అలస్యం కావటంతో 12 గంటలకు ప్రారంభించారు. గంటన్నర సమయంలో ఎలాంటి సమీక్షలు చేపట్టకుండానే అధికారులు శాఖల వారీగా ప్రభుత్వ పథకాలు, వాటికి వెచ్చించిన నిధులు వ్యయంపై చదువుకుంటు పోయారు. అర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ జేఈ అయితే మండలంలో అన్ని రక్షిత పథకాలు వినియెగంలో ఉన్నాయని సీపీడబ్ల్యూ స్కీంలు అన్నీ పని చేస్తున్నాయని సమావేశంలో చదవి వెళ్లిపోతుండగా, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి మా గ్రామానికి నీరు రావటం లేదని ట్యాంకు పనిచేయటం లేదని ఫిర్యాదు చేయటం కొసమెరుపు.

అలాగే, సమావేశానికి పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కూడా గైర్హాజరయ్యారు. ఈసందర్భంగా మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తిచేసేలా అందరూ కృషి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఏవో కుమారి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వెంటనే ఈపంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ చింతల అంజలి, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దార్ కె.రవిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ శ్రీనువలి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఎస్సీల అభ్యున్నతి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

» 40 కుటుంబాలు పార్టీలో చేరిక


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన పర్చూరు ఎస్సీ కాలనీ వాసులు

పర్చూరు, జనవరి 23: తెలుగుదేశం పార్టీతోనే ఎస్సీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎస్సీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన 40 ఎస్సీ కుంటుంబాలు ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలుకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఎస్సీలు పార్టీకి వెన్నుముఖగా ఉన్నారన్నారు. ఎస్సీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఎస్సీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌కు సంబంధించిన మేనిఫెస్టోను రూపొందిస్తుందన్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన ఎస్సీ లందరికీ పక్కా ఇళ్ళు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడతానన్నారు. ఎస్సీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రానున్న తెలుగు దేశం ప్రభుత్వం పని చేస్తుందని భరోసా వ్యక్తం చేశారు.

వలంటీర్లు చేరిక..


ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పర్చూరుకు చెందిన ముగ్గురు వలంటీర్లు దామచర్ల నాగరాజు, మూకిరి కోటేశ్వరరావు, కంభం రాజు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మరో 35 కుంటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. దామచర్ల లింగేశ్వరరావు, రావూరి నాగరాజు, రావూరి రామాంజనేయులు, ఏకశిరి కలగయ్య, రావూరి ఏడుకొండలు, పాలపర్తి కోటేశ్వరరావులతోపాటు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, మామిడిపాక హరిప్రసాద్, టి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, జనవరి 23: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధి చెందాలని కడవకుదురు సర్పంచ్ గొల్లమూరి శివకుమారి అన్నారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఆమె మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో శివకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు డిజిటల్ చదువులు అందించాలన్న సంకల్పంతో విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కె.రామారావు, శ్రీనివాస్, ప్రసాద్, శివయ్య, త్రిపురాంతకరావు, హెలన్ రూత్, జరీనాతాజ్, కవిత, సంపతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలు లేని రాజకీయాలు చేయొద్దు!

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సన్మానించిన రామకృష్ణ, ఏలూరి సాంబశివరావు, మంతెన అనంతవర్మ తదితరులు

పిట్టలవానిపాలెం, జనవరి 23: రాజకీయాలలో నైతిక విలువలు లేని ప్రజలకు ఉపయోగపడని రాజకీయాలు చేయకూడదనేది సీపీఐ లక్ష్యమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మండలపరిధిలోని సంగుపాలెం, కోడూరు గ్రామపంచాయతీలలో మంగళవారం జరిగిన గ్రామ వాసి, తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సన్మాన సభ ఏర్పాటుచేశారు. సభలో సంగుపాలెం, కోడూరు గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారిగా ఉండే రాజకీయాలను చేయాలే తప్ప ప్రజలను ఇబ్బందిపెట్టే రాజకీయాలు చేయరాదన్నారు. ప్రస్తుత రాజకీయాలు రాష్ట్రంలో భ్రష్టుపట్టిపోయాయని విమర్శించారు. సంగుపాలెం కోడూరు గ్రామం నుంచి వెళ్ళిన తనను తెలంగాణ రాష్ట్రంలో కొత్తగూడెం ఎమ్మెల్యేగా ప్రజలు రెండు పర్యాయాలు ఆదరించి గెలిపించారని సన్మానగ్రహీత కూనంనేని సాంబశివరావు తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను రాజకీయబిక్ష పెట్టిన పార్టీని గ్రామ ప్రజలను ఎప్పుడూ మరిచి పోకూడదని అన్నారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రాజకీయనాయకులు వస్తూ పోతుంటారు కాని నిజాయితీ, నిబద్ధతతో కూడిన రాజకీయాలలో కూనంనేని సాంబశివరావు ఒకరని కొనియాడారు.సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కుగ్రామమైన సంగుపాలెం కోడూరు నుంచి 40ఏళ్ళ క్రితం వెళ్లి తెలం గాణ రాష్ట్రంలోని కొత్తగూడెంలో స్థిరపడి సీపీఐలో కీలక పదవులు అలంకరించి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవటం నిబద్ధతతో కూడిన విజయమని ఆకాంక్షించారు. టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు ప్రలోభాలకు ఆకర్షితులై నీతి నిజాయితీ కలిగిన నాయకులను ప్రజలు దూరం చేసుకుంటున్నారని అలాంటి సంస్కృతి మారాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు మాట్లాడుతూ ఈ గ్రామంతో కూనంనేని సాంబశివరావుతో, తనకు అనేక సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీపీఐ నాయకుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ లాభాపేక్ష ఆశించని పార్టీ ఏదైన ఉందంటే సీపీఐ ఒక్కటేనని తెలిపారు. ఈ సందర్భంగా సినీగాయకులు వందేమాతరం శ్రీనివాస రావు గీతాలాపన గావించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు ముప్పా రమేష్, సంగుపాలెంకోడూరు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు ఎనికేపల్లి శివకుమారి, ఐనంపూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ వైద్యం అందించడమే లక్ష్యం

చినగంజాం, జనవరి 23: ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ హనుమంతరావు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీ చరణ్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ షేక్ హసీనాబేగం, డాక్టర్ లక్ష్మీనారాయణ 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ భూలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ గ్రామ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకరిస్తాం


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 22: స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో అసంపూర్తిగా నిలిచిన బార్ అసోసియేషన్ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఏసయ్య, ఏఈ రవి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చినగంజాంలో షటిల్ టోర్నమెంట్

చినగంజాం, జనవరి 23: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రిపబ్లిక్ డే సందర్భంగా చినగంజాం బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీల్లో చినగంజాం, ఇంకొల్లు, మార్టూరు, వేటపాలెం, నాగులుప్పలపాడు మండలాల స్థాయిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7659896941, 8519944336 సెల్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏలూరి

మార్టూరు, జనవరి 23: రజక వృత్తిదారులకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచింది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పోలూరి సింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి

ఉప్పుటూరు(పర్చూరు), జనవరి 23: ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన బోయిన శివరామకృష్ణ(40) మరో వ్యక్తితో కలసి నెల్లూరు వెళ్ళేందుకు చీరాల రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ఈక్రమంలో మూత్ర విసర్జనకు వెళ్ళి ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో జీఆర్‌పీ పోలీసులు

చీరాల, టౌన్ 23: అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల నగదును చీరాల జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ఓ వ్యక్తి బ్యాగ్‌తో రైలు నుంచి దిగగా అనుమానంతో తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో సదరు వ్యక్తిని ఆదుపులోకి తీసుకొని నగదును స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు, పత్రాలు లేకపోవటంతో ఆదాయశాఖ అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

నెరవేరని నేతబజారు లక్ష్యం

చీరాల, జనవరి 23: స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా నిర్మించిన నేతబజారు లక్ష్యానికి ఆమడదూరంలో ఉంది. చేనేత సహకార సంఘాలలో తయారైన వస్త్రాలను విక్రయించేందుకు వీలుగా నేతబజారు దుకాణ సముదాయాన్ని నిర్మించారు. అందులో సగానికి పైగా దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో లక్ష్యం నెరవేరటం లేదు.

చీరాల ప్రాంతంలో చేనేత సహకారసంఘాలు ఎక్కువ. క్షేత్రస్థాయిలో పనిచేసేవి, కాగితాల మీద మాత్రమే కనిపించేవి సుమారు 30 సంఘాలకు పైగా ఉంటాయి. అందులోని మగ్గాలపై నేసిన వస్త్రాలు ఆప్కోతో పాటు నేరుగా విక్రయాలు జరుపుకునేందుకు నేతబజారులో దుకాణాల నిర్మాణం జరిగింది. 16 గదులతో నిర్మాణం చేశారు. ఒక్కో సంఘానికి ఒక్కో దుకాణం కేటాయించి నేరుగా కొనుగోలుదారులతో మమేకం అయ్యేందుకు ఈ దుకాణాలు దోహదపడతాయనేది అప్పటి పాలకుల ఆలోచన. అయితే దుకాణాల కేటాయింపులో ఆదిలోనే హంసపాదు అన్నట్లు అనర్హులకు కేటాయించారని ఆరోపణలు వచ్చాయి. అది నిజమని తేలటంతో అలా కేటాయించిన ఓ దుకాణాన్ని తరువాత లీజు రద్దుచేశారు. ఆ తరువాత దుకాణాలు కొంతకాలం నిర్వాహకులు సక్రమంగానే నిర్వహించారు. అయితే, నేతబజారుకు కూతవేటు దూరంలో ఎంజీసీ మార్కెట్, ఆర్‌ఆర్ రోడ్డు, కామధేను కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లోని వస్త్ర దుకాణాల పోటీకీ నేత బజారులో వ్యాపారాలు పోటీపడలేపోయాయి. దీంతో దుకాణాల్లో కొన్ని ఖాళీగా ఉంటున్నాయి. నేతబజారు పైఅంతస్తులో ఉన్న పలు గదులను ఏడీ కార్యాలయం కింద ఉపయోగిస్తున్నారు. పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చెలామణి అవుతున్నాయి. దీంతో చేనేత వస్త్రాలకు గిరాకీ తగ్గుతోంది. ఈనేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి నేతబజారు లక్ష్యం నెరవేరేలా తగిన చర్యలు చేపట్టాలని చేనేతరంగ ప్రతినిధులు కోరుతున్నారు.

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(విద్య), జనవరి 23: ఇంజనీరింగ్ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను విలీనం చేస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.గుండారెడ్డి డిమాండ్ చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు మంగళవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తేవడం చారిత్రక తప్పిదమన్నారు. అనంతరం వైస్‌చాన్స్‌లర్ అంజిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

ఒంగోలు నగరం, జనవరి 23: ఒంగోలులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 27న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి టి.భరద్వాజ్ తెలి పారు. జియో టెలికమ్ సంస్థలోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేల్స్ ఆఫీసర్, జియో ఫైబర్ ఇంజనీర్, ఫైబర్ అసోసియేట్, జియో పాయింట్ మేనేజర్, జియో పాయింట్ అసిస్టెంట్ మేనేజర్, ఫీల్డు ఇంజనీర్ తదితర ఖాళీల భర్తీకి ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ, గ్రాడ్యుయేషన్, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.